PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 023 | శుక్రవారం | 17-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 023 | Friday | 17-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri

## హిందూ సంస్కృతిపై దాడి

» సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన
» విద్యార్థికి మతపైరమన హోం వర్క్
» కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి "కల్మా", "సూరహ్ ఫాతిహా" రాసి పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై వారు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.
(వివరాలు 2లో..)


3లో..

## వన్‌ప్లస్ ఇండియా వీడుతుందా?

• మార్కెట్‌లో పెద్ద ఎత్తున ఊహాగానాలు
• భారత్‌లో కార్యకలాపాలు కొనసాగుతాయా?
• అసలు విషయం చెప్పిన కంపెనీ


3లో..

## వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడండి


3లో..

## హైదరాబాద్‌లో జగన్నాథ రథయాత్ర


### భక్తులతో కిక్కిరిసిన వీధులు

హైదరాబాద్‌లో జగన్నాథ స్వామి రథయాత్ర భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. బంజారాహిల్స్ జగన్నాథ ఆలయం, ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆషాఢ శుక్ల ద్వితీయ సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అమ్మవారి విగ్రహాలను అందంగా అలంకరించిన రథాలపై ఊరేగించారు. ఒడిశాలోని పూరీ రథయాత్ర స్ఫూర్తితో నిర్వహించే ఈ వేడుకలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## పూరీ రథయాత్రలో విషాదం

### తొక్కిసలాటలో ఇద్దరి మృతి

ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. లక్షలాది మంది భక్తులు రథాలను లాగేందుకు భారీగా తరలిరావడంతో తొక్కిసలాటలాంటి పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


3లో..

## ₹ 150 కోట్ల ఆస్తి పంచాయితీ

### తండ్రినే కాల్చిచంపిన కొడుకు • ఘాజియాబాద్‌లో దారుణం

ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్ జిల్లా మోదీనగర్‌లో ఆస్తి వివాదం దారుణ హత్యకు దారి తీసింది. రూ.150 కోట్ల విలువైన ఆస్తులు కలిగిన రైతు హరియోమ్ చౌదరిని ఆయన పెద్ద కుమారుడు నిఖిల్ కాల్చిచంపినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన నిఖిల్‌కు తండ్రితో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో తుపాకీ తీసి వరుసగా కాల్పులు జరిపినట్లు విచారణలో వెల్లడైంది. ఘటన అనంతరం నిందితుడు ఆయుధంతో పరారయ్యాడు.

# గోల్కొండలో బోనాల వేడుక

### అమ్మవారికి తొలి బోనం సమర్పణ



తెలంగాణలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోల్కొండ కోటలోని శ్రీ జగదంబ మహంకాళి ఆలయంలో తొలి బోనం సమర్పణతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలతో గోల్కొండ పరిసరాలు భక్తి పారవశ్యంతో కళకళలాడాయి.


3లో..

# సీతారామ పూర్తి చేస్తాం

- రీడిజైన్ `పేరుతో దోచేసుకున్నారు
- బీఆర్ఎస్ తీరుతోనే ప్రాజెక్టుల్లో జాప్యం
- గోదావరి జలాలతో ఖమ్మం సస్యశ్యామలం
- ప్రతి బొట్టు నీటి వినియోగమే లక్ష్యమన్న మంత్రులు



గోదావరిలో ప్రవహిస్తున్న ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించి రైతులకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. దేవాదుల ప్రాజెక్టు తర్వాత సీతారామ ప్రాజెక్టు పనులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. గోదావరిపై నిర్మాణంలో ఉన్న చివరి ప్రధాన ప్రాజెక్టు సీతారామేనని, దీన్ని పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం కల్పిస్తామని చెప్పారు. (2లో..)

## ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది

» యువ సంగ్రామ సదస్సుతో సమరశంఖం
» కాంగ్రెస్‌కు ప్రజలే తీర్పు చెబుతారన్న కేటీఆర్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సగం పదవీకాలం పూర్తికాక ముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. (2లో..)

## కాంగ్రెస్ పాలనలో కరెంట్ సంక్షోభం

### రైతులను చీకట్లోకి నెట్టారు: హరీశ్‌రావు



రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పూర్తిగా దెబ్బతిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ పోతే వార్త అయ్యేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ వస్తేనే వార్త అయ్యే పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎనిమిది గంటల పాటు కూడా విద్యుత్ అందడం లేదని, అందుకే సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఆందోళనలకు దిగుతున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. (2లో..)

# అసలు యుద్ధం మొదలు

• కీలక బిల్లులపై మోదీ సర్కార్ ఫోకస్ • అస్త్ర శస్త్రాలతో దాడికి కాంగ్రెస్ సిద్ధం

- మూడింట రెండొంతుల మెజారిటీ వేట
- పార్లమెంట్‌లో కొత్త రాజకీయ సమీకరణాలు
- వర్షాకాల సమావేశాలపై బీజేపీ ఫోకస్

జులై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈసారి దేశ రాజకీయాలను ప్రభావితం చేసే కీలక ఘట్టంగా మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం వరుసగా కొత్త బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుండగా, రాజ్యాంగ సవరణలకు అవసరమైన ప్రత్యేక మెజారిటీ సాధించడమే అతిపెద్ద సవాల్‌గా నిలిచింది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు సమగ్ర వ్యూహంతో ముందుకొస్తోంది. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్, న్యాయవ్యవస్థ, పన్ను సంస్కరణలు, విదేశీ విరాళాల నియంత్రణ వంటి అంశాలు సభలో ప్రధాన చర్చగా మారనున్నాయి. ప్రతి బిల్లుపై అధికార పక్షం సంఖ్యాబలం పరీక్షకు గురికానుండగా, ప్రతిపక్షం ప్రతి అవకాశాన్ని రాజకీయ ఆయుధంగా మలచేందుకు సిద్ధమవుతోంది. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్, డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలు, చిన్న పార్టీల వైఖరి, తిరుగుబాటు ఎంపీల కదలికలు కూడా ఈ సమావేశాల దిశను నిర్ణయించే అంశాలుగా మారాయి. కేవలం చట్టాల ఆమోదానికే పరిమితం కాకుండా, అధికార పక్షం–ప్రతిపక్షం మధ్య రాజకీయ ఆధిపత్య పోరుకు కూడా ఈ సమావేశాలు వేదిక కానున్నాయి. సభలో జరిగే ప్రతి చర్చ, ప్రతి ఓటింగ్, ప్రతి వ్యూహం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ సమావేశాలపై ఆసక్తి నెలకొంది.


వివరాలు2లో..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ కేంద్ర ప్రభుత్వానికి సంఖ్యాబలం అతిపెద్ద సవాలుగా మారింది. రెండు కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేయడమే ఎన్డీయే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు 30 రోజుల పాటు జైలులో ఉంటే పదవి నుంచి తొలగించే 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఒకటి. మహిళల రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో అనుసంధానించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మరోటి. ఇవి సాధారణ బిల్లులు కాకపోవడంతో మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి కావడం రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చింది.

## ఎదురుదాడే అస్త్రం

### రామ్ మందిరం నుంచి • డీలిమిటేషన్ వరకు పోరు

### బీజేపీని ఇరుకునపెట్టేలా • వ్యూహం ఖరారు చేసిన కాంగ్రెస్



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని అన్ని కీలక అంశాలపై నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అయోధ్య రామ్ మందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలు, విద్యా వ్యవస్థ బలహీనత, ప్రశ్నపత్రాల లీకులు, ధరల పెరుగుదల, అవినీతి, విదేశాంగ వైఫల్యాలు వంటి అంశాలను ప్రధానంగా లేవనెత్తాలని పార్టీ వ్యూహం రూపొందించింది. సోనియా గాంధీ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యూహ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.
(వివరాలు 2లో..)

## డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ ఒత్తిడి

◆ అఖిలపక్షం భేటీకి ఖర్గే డిమాండ్
◆ ప్రధానికి ఏఐసీసీ చీఫ్ లేఖ



డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పార్లమెంట్‌లో సవరించిన డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలతో విస్తృతంగా చర్చించాలని కోరారు. ప్రతిపక్షాలకు ప్రతిపాదనలను పూర్తిగా అధ్యయనం చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యసంప్రదాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని మార్చి నెల నుంచే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు పలుమార్లు లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. అయితే ఆ విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### సభకు ఈసారి ఐదు కొత్త బిల్లులు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల బిజినెస్ జాబితాను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచే సవరణ, ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు, విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, జనన-మరణాల నమోదు నిబంధనల సవరణలు కీలకంగా ఉండనున్నాయి. జాతీయ గౌరవ పరిరక్షణ చట్టంలో మార్పులతో పాటు ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించిన కొత్త బిల్లులను కూడా ప్రభుత్వం తీసుకురానుంది. 2022-23 అదనపు వ్యయాలపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

# ఎదురుదాడే అస్త్రం

- రామ్ మందిరం నుంచి
- డీలిమిటేషన్ వరకు పోరు
- బీజేపీని ఇరుకునపెట్టేలా
- వ్యూహం ఖరారు చేసిన కాంగ్రెస్

**డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేకత**

లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించాలని నిర్ణయించింది. ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సవరించిన ప్రతిపాదనలపై అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని కూడా కోరారు.

**రామ్ మందిర విరాళాల అంశం**

అయోధ్య రామ్ మందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలను పార్లమెంట్‌లో ప్రధాన అంశంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. విద్యా వ్యవస్థలో క్షీణత, సంస్థల స్వతంత్రతపై ప్రభావం, రాజకీయ పార్టీల చీలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల ఉల్లంఘన వంటి అంశాలపై కూడా ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ఖర్గే తెలిపారు. ఈ విషయాలపై కేంద్రం సమాధానం చెప్పాల్సిందేనని కాంగ్రెస్ స్పష్టం చేసింది.

**ప్రభుత్వ బిల్లులకు అడ్డుకట్ట**

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే పలు బిల్లులను వ్యతిరేకించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణలు, జాతీయ ఆహార భద్రత చట్టంలో మార్పులు, 30 రోజుల కస్టడీలో ఉన్న మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలకు కూడా వ్యతిరేకంగా నిలవాలని నిర్ణయించింది. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా భావిస్తున్న ఏ బిల్లుకూ మద్దతు ఇవ్వబోమని కాంగ్రెస్ ప్రకటించింది.



**ఇండియా కూటమి ఉమ్మడి వ్యూహం**

డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు కేంద్రం రాజకీయ ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీల ఐక్యతను కాపాడేందుకు ప్రయత్నిస్తామని జైరాం రమేశ్ తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇతర ప్రతిపక్ష పార్టీలతో చర్చలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. వర్షాకాల సమావేశాలకు ముందు ఇండియా కూటమి కూడా సమావేశమై ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేయనుంది. దీంతో పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య డీలిమిటేషన్ బిల్లు సహా పలు అంశాలపై తీవ్ర వాగ్వాదం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ ఒత్తిడి

- అఖిలపక్షం భేటీకి ఖర్గే డిమాండ్
- ప్రధానికి ఏఐసీసీ చీఫ్ లేఖ

డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పార్లమెంట్‌లో సవరించిన డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలతో విస్తృతంగా చర్చించాలని కోరారు. ప్రతిపక్షాలకు ప్రతిపాదనలను పూర్తిగా అధ్యయనం చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని మార్చి నెల నుంచే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు పలుమార్లు లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. అయితే ఆ విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి ప్రధానిని నేరుగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవడం అవసరమని స్పష్టం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనపై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జనాభా ఆధారంగా జరిగే డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆ సందేహాలను నివృత్తి చేసేలా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో తొందరపాటు నిర్ణయాల కంటే సమగ్ర చర్చ అవసరమని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది.

**పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాన అంశం**



ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక ఆమోదం పొందలేదని ఖర్గే గుర్తు చేశారు. జులై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ అంశం మళ్లీ చర్చకు వచ్చే అవకాశం ఉంది. దీనిపై కాంగ్రెస్ తన వ్యూహాన్ని ఇప్పటికే ఖరారు చేసింది. రాహుల్ గాంధీ సహా పార్టీ సీనియర్ నేతలు సమావేశమై పార్లమెంట్‌లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. డీలిమిటేషన్ అంశంపై ప్రతిపక్షాల ఐక్యతను కొనసాగించాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

# అసలు యుద్ధం మొదలు

- మూడింట రెండొంతుల మెజారిటీ వేట
- పార్లమెంట్‌లో కొత్త రాజకీయ సమీకరణాలు
- వర్షాకాల సమావేశాలపై బీజేపీ ఫోకస్



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ కేంద్ర ప్రభుత్వానికి సంఖ్యా బలం అతిపెద్ద సవాలుగా మారింది. రెండు కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేయడమే ఎన్డీయే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు 30 రోజుల పాటు జైలులో ఉంటే పదవి నుంచి తొలగించే 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఒకటి. మహిళల రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో అనుసంధానించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మరొకటి. ఇవి సాధారణ బిల్లులు కాకపోవడంతో మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి కావడం రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చింది.

**• ఏప్రిల్‌లో ఎదురుదెబ్బ**

గత ఏప్రిల్‌లో డీలిమిటేషన్ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేకపోయింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అనుకూలంగా 298 ఓట్లు వచ్చాయి. వ్యతిరేకంగా 230 ఓట్లు నమోదయ్యాయి. ప్రత్యేక మెజారిటీకి అవసరమైన 352 ఓట్లకు ప్రభుత్వం 54 ఓట్లు తక్కువగా నిలిచింది. దీంతో బిల్లు ఆగిపోయింది. ఇప్పుడు ఆ లోటును భర్తీ చేసే వ్యూహంపై ఎన్డీయే దృష్టి పెట్టింది.

**• మారుతున్న సమీకరణాలు**

ఇటీవలి రాజకీయ పరిణామాలు అధికార కూటమికి ఆశలు పెంచుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలు కొత్త రాజకీయ వేదిక ఏర్పాటు చేసి ఎన్డీయేకు మద్దతు ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నారనే చర్చ జరుగుతోంది. మరోవైపు తమిళనాడులో డీఎంకేకు కాంగ్రెస్‌తో దూరం పెరుగుతోందనే ప్రచారం కూడా కొనసాగుతోంది. ఈ పరిణామాలు లోక్‌సభలో బిల్లుల ఆమోదానికి ఉపయోగపడతాయని ఎన్డీయే వర్గాలు భావిస్తున్నాయి.

**• లోక్‌సభలో సంఖ్యల లెక్క**

ప్రస్తుతం లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. ప్రత్యేక మెజారిటీకి 360 ఓట్లు అవసరం. ఎన్డీయే వద్ద ప్రస్తుతం 292 మంది సభ్యుల బలం ఉంది. తృణమూల్ తిరుగుబాటు ఎంపీలు చేరితే బలం 312కు చేరుతుంది. శివసేన ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు మద్దతిస్తే 318 అవుతుంది. డీఎంకేకు చెందిన 22 మంది సభ్యులు అనుకూలిస్తే సంఖ్య 340కు చేరుతుంది. ఎన్సీపీ శరద్ పవార్ వర్గానికి చెందిన ఎనిమిది మంది మద్దతు ఇస్తే మొత్తం 348 అవుతుంది. అయినా ప్రత్యేక మెజారిటీకి ఇంకా 12 ఓట్లు తక్కువే. ఈ లోటు భర్తీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ, జేఎంఎం, వీసీకే, అకాలీదళ్, స్వతంత్ర సభ్యుల మద్దతు అవసరం కావచ్చు.

**• కీలకంగా గైర్హాజరు వ్యూహం**

కొన్ని పార్టీలు ప్రత్యక్షంగా మద్దతు ఇవ్వకుండా ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం కూడా చర్చలో ఉంది. అలాంటి పరిస్థితిలో ఓటింగ్‌లో పాల్గొనే సభ్యుల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో ప్రత్యేక మెజారిటీకి అవసరమైన సంఖ్య కూడా తగ్గుతుంది. తృణమూల్ తిరుగుబాటు ఎంపీలు, డీఎంకే, శివసేన ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీ శరద్ పవార్ వర్గం ఓటింగ్‌కు దూరంగా ఉంటే మొత్తం ఓటింగ్ సభ్యుల సంఖ్య 484కు పడిపోతుంది. అప్పుడు ప్రత్యేక మెజారిటీ లక్ష్యం 323కు తగ్గుతుంది. అయినప్పటికీ ఎన్డీయేకు ఇంకా 31 ఓట్లు అవసరం అవుతాయి.

**• రాజ్యసభలోనూ కఠిన పరీక్షే**

రాజ్యసభలో కూడా ప్రభుత్వం సులభంగా గెలిచే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం సభలో 242 మంది సభ్యులు ఉన్నారు. ప్రత్యేక మెజారిటీకి 162 ఓట్లు అవసరం. ఎన్డీయే వద్ద సుమారు 150 మంది సభ్యుల బలం ఉంది. డీఎంకేకు చెందిన ఎనిమిది మంది, ఎన్సీపీ శరద్ పవార్ వర్గానికి చెందిన ఒక సభ్యుడు మద్దతిస్తే సంఖ్య 159కు చేరుతుంది. పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న ఉపఎన్నికల ద్వారా మరో ముగ్గురు బీజేపీ సభ్యులు రాజ్యసభకు వస్తే బలం పెరిగే అవకాశం ఉంది. అయినా ప్రత్యేక మెజారిటీకి ఇంకా కొన్ని ఓట్లు తక్కువగానే ఉండే పరిస్థితి కనిపిస్తోంది.

**• ప్రతి ఓటు కీలకమే**

వర్షాకాల సమావేశాల్లో ప్రతి ఓటు అత్యంత కీలకంగా మారనుంది. మద్దతులు, తిరుగుబాట్లు, గైర్హాజరు వ్యూహాలు, చిన్న పార్టీల నిర్ణయాలు బిల్లుల భవితవ్యాన్ని నిర్ణయించే అవకాశం ఉంది. ఒకవైపు రాజ్యాంగ సవరణలపై ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగాలని చూస్తుండగా, మరోవైపు ప్రతిపక్షం ఐక్యంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో ఈ సమావేశాలు సంఖ్యాబలం చుట్టూ తిరిగే రాజకీయ పోరాటానికి వేదికగా మారనున్నాయి.

# సీతారామ పూర్తి చేస్తాం

- రీడిజైన్ పేరుతో దోచేసుకున్నారు
- బీఆర్ఎస్ తీరుతోనే ప్రాజెక్టుల్లో జాప్యం
- గోదావరి జలాలతో ఖమ్మం సస్యశ్యామలం
- ప్రతి బొట్టు నీటి వినియోగమే లక్ష్యమన్న మంత్రులు

**సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం గోదావరి తీరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టు పురోగతిపై వివరాలు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. ప్రజాధనంలో ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

**కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచి ఖజానాపై అదనపు భారం మోపిందని భట్టి విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్, రుద్రంకోట ఇందిరాసాగర్ ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించారని గుర్తు చేశారు. తర్వాత రీడిజైన్ పేరుతో వ్యయాన్ని రూ.24 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఇప్పటికే భారీగా ప్రజాధనం ఖర్చయినందున ప్రాజెక్టును నిలిపివేయడం సాధ్యం కాదని, పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్న ఉత్తమ్**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై లక్షా 80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పూర్తి స్థాయిలో ప్రయోజనం అందలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపాలతో దెబ్బతిందని ఆరోపించారు. మేడిగడ్డ, ఇతర బ్యారేజీల నిర్మాణంలో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీతారామసాగర్ ద్వారా ఒక్క ఎకరానికైనా సాగునీరు అందించలేకపోయారని గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా పొలాలకు చేరుస్తుందని తెలిపారు.



**రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యం**

ప్రస్తుత ప్రభుత్వం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. రైతుల నుంచి వరి కొనుగోలు చేసి నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేశామని గుర్తు చేశారు. సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు గోదావరి జలాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రులు తెలిపారు.

# హిందూ సంస్కృతిపై దాడి

- సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన
- విద్యార్థికి మతపైరమన హోం వర్క్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి "కల్మా", "సూరహ్ ఫాతిహా" రాసి పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై వారు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

**టీచర్‌పై స్కూల్ చర్య**

వివాదం తీవ్రరూపం దాల్చడంతో స్కూల్ యాజమాన్యం స్పందించింది. సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్‌కు చెందిన ఏ విద్యాసంస్థలోనూ ఆమెకు ఉద్యోగం ఇవ్వబోమని స్పష్టం చేసింది. జరిగిన ఘటనపై అంతర్గతంగా కూడా విచారణ చేపట్టినట్లు యాజమాన్యం తెలిపింది.

**పోలీసులకు ఫిర్యాదు**

విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ పిల్లలకు మతపరమైన పాఠాలు నేర్చుకోవాలని చెప్పడం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందేనని టీచర్ చెప్పినట్లు ఆరోపించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసుపై న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

**బీజేపీ నిరసన.. బండి సంజయ్ స్పందన**

ఘటనపై బీజేపీ నాయకులు స్కూల్ వద్ద నిరసన చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరహ్ ఫాతిహా పఠించాలని హోంవర్క్ ఇవ్వడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. విద్యార్థులపై బలవంతంగా మతపరమైన బోధనలు రుద్దడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఈ అంశంపై అన్ని వర్గాలు స్పందించాలని కోరారు. ప్రస్తుతం ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**సైదాబాద్ ఘటనపై బీజేపీ చీఫ్ ఆగ్రహం**

సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో చోటుచేసుకున్న ఘటనను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంపై రాష్ట్రప్రభుత్వం వెంటనే నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యంతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును కూడా రద్దు చేయాలని సూచించారు. రెండో తరగతి చదువుతున్న విద్యార్థికి కల్మా, సూరా అల్ ఫాతిహా హోంవర్క్‌గా ఇవ్వడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని రాంచందర్‌రావు అన్నారు. ఒక ఉపాధ్యాయురాలిని విధుల నుంచి తొలగించడం మాత్రమే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత పాఠశాల యాజమాన్యానిదేనని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు విద్యను బోధించాలే తప్ప విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దకూడదని పేర్కొన్నారు.

# ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది

- యువ సంగ్రామ సదస్సుతో సమరశంఖం
- కాంగ్రెస్‌కు ప్రజలే తీర్పు చెబుతారన్న కేటీఆర్

**డిక్లరేషన్ల పేరుతో మోసం**



ఆడబిడ్డల నుంచి రైతుల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్క వర్గానికీ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రకటించిన వివిధ డిక్లరేషన్లు కేవలం ఓట్ల కోసమేనని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి అవినీతి, అక్రమాలు, స్కామ్‌లే పాలనగా మారాయని అన్నారు. అందుకే సమాజంలోని ప్రతి వర్గం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు.

**రైతుల పరిస్థితిపై ఆందోళన**

రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని కేటీఆర్ అన్నారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తుంటే వారికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రైతుల్లో ఆగ్రహాన్ని పెంచాయని చెప్పారు. చివరకు రైతులు తమ పొలాలకు నీళ్లు ఇవ్వాలని వేడుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని అన్నారు.

**యువతకు భారీ మోసమన్న ఆరోపణ**

యువత, నిరుద్యోగుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరుతో పెద్ద మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాలు, అవకాశాల పేరుతో ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ వైఫల్యాలను ఇప్పటికే ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుస సభలు నిర్వహిస్తోందని తెలిపారు.

**జూలై 18న యువ సంగ్రామ సదస్సు**

వరంగల్‌లో రైతు సభ నిర్వహించిన తర్వాత ఇప్పుడు యువత కోసం మరో భారీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. జూలై 18న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి భారీగా యువత తరలివస్తారని పార్టీ నాయకులు సమావేశంలో వివరించారు. సభను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు కేటీఆర్ తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో కరెంట్ సంక్షోభం

**రైతులను చీకట్లోకి నెట్టారు: హరీశ్‌రావు**

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పూర్తిగా దెబ్బతిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ పోతే వార్త అయ్యేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ వస్తేనే వార్త అయ్యే పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎనిమిది గంటల పాటు కూడా విద్యుత్ అందడం లేదని, అందుకే సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఆందోళనలకు దిగుతున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.



**రైతులకు కరెంట్ ఇవ్వండి**

రాజకీయ ఆరోపణలు పక్కనపెట్టి విద్యుత్ ఉత్పత్తి పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్లు ఉన్నా, బొగ్గు కొరత కారణంగా ఉత్పత్తి తగ్గిపోయిందని అన్నారు. నాణ్యమైన బొగ్గు సరఫరా చేసి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. సమస్యలను గుర్తుచేస్తే వాటిని రాజకీయాలుగా చూపించడం సరికాదని వ్యాఖ్యానించారు.

**భూములపై పన్నులా?**

రైతులకు కరెంట్ ఇవ్వలేని ప్రభుత్వం ఇప్పుడు భూములపై పన్నులు విధించాలని చూస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. సాగునీరు కోరితే "రక్తం పారిస్తాం" అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రెండు పంటలకు బోనస్ హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. రైతులు విద్యుత్ కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు.

**విద్యుత్ ఉత్పత్తిపై ప్రశ్నలు**


రాష్ట్రానికి 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం కేవలం 3,100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయని హరీశ్‌రావు చెప్పారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు కేవలం 33 శాతానికి పడిపోయాయని, ఎల్‌నినో ప్రభావం ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని ఆరోపించారు. గ్రీన్ ఎనర్జీ విధానాన్ని కూడా నిలిపివేసి రాష్ట్రాన్ని ఇబ్బందుల్లోకి నెట్టారని అన్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణ**

దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందే పరిస్థితిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కోతలు, వాగ్దానాలే తప్ప ఫలితాలు కనిపించడం లేదని విమర్శించారు. విద్యుత్ సంక్షోభం వల్ల రైతులతో పాటు పరిశ్రమలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ముందుచూపు లేకుండా పాలన సాగించడం వల్ల రాష్ట్రం అంధకార పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆరోపించారు. రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు అందించడంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా

**కర్ణాటకకు తరలిస్తుండగా పట్టివేత**



హైదరాబాద్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా ముఠాను గచ్చిబౌలి పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 220 టన్నుల రేషన్ బియ్యం, 40 బస్తాల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన నాలుగు లారీలు, నాలుగు టాటా ఏస్ వాహనాలను సీజ్ చేశారు. గౌలిదొడ్డి ప్రాంతం నుంచి కర్ణాటకకు ఈ సరుకును తరలిస్తుండగా సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ అధికారులు, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి పట్టుకున్నారు. నిందితులపై కంట్రోల్ యాక్ట్-2016 కింద కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో జగన్నాథ రథయాత్ర

- భక్తులతో కిక్కిరిసిన వీధులు




హైదరాబాద్‌లో జగన్నాథ స్వామి రథయాత్ర భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. బంజారాహిల్స్ జగన్నాథ ఆలయం, ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆషాఢ శుక్ల ద్వితీయ సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అమ్మవారి విగ్రహాలను అందంగా అలంకరించిన రథాలపై ఊరేగించారు. ఒడిశాలోని పూరీ రథయాత్ర స్ఫూర్తితో నిర్వహించే ఈ వేడుకలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### నగర వీధుల్లో భక్తి సందడి

ఇస్కాన్ నిర్వహించిన రథయాత్ర ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైంది. నారాయణగూడ, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, గన్‌ఫౌండ్రీ, జీపీఓ సర్కిల్, మొజంజాహీ మార్కెట్ మీదుగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు కొనసాగింది. రథాల వెంట నడుస్తూ భక్తులు భజనలు, కీర్తనలు, నృత్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. భారీ రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పోలీసులు పలు మార్గాల్లో దారి మళ్లింపులు అమలు చేశారు.

### రథాన్ని లాగిన భక్తులు

రథయాత్రలో పాల్గొన్న భక్తులు స్వయంగా రథాలను లాగుతూ మొక్కులు చెల్లించారు. ఇస్కాన్ వాలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఏర్పాట్లలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు. రథాన్ని లాగాలనుకున్న ప్రతి భక్తికి అవకాశం కల్పించారు. దీంతో రథయాత్రలో పాల్గొన్నవారిలో ఆధ్యాత్మిక ఉత్సాహం మరింత పెరిగింది. నగర వీధులన్నీ భక్తి గీతాలు, హరినామ సంకీర్తనలతో మార్మోగాయి.

### బంజారాహిల్స్‌లో ప్రత్యేక వేడుకలు

బంజారాహిల్స్‌లోని జగన్నాథ ఆలయంలో కూడా రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథాలను భక్తులు ఉత్సాహంగా లాగారు. జగన్నాథ స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ పూజలు, మంగళహారతులు, భక్తి నినాదాల మధ్య ఉత్సవాలు కొనసాగాయి. పూరీ రథయాత్రను తలపించేలా హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుక భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించింది. నగరంలో భక్తి, సంప్రదాయం కలిసిన ఈ మహోత్సవం విజయవంతంగా ముగిసింది.



# పూరీ రథయాత్రలో విషాదం

- తొక్కిసలాటలో ఇద్దరి మృతి

ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. లక్షలాది మంది భక్తులు రథాలను లాగేందుకు భారీగా తరలిరావడంతో తొక్కిసలాటలాంటి పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### అంబులెన్స్‌కు దారి కల్పించే క్రమంలో..

శ్రీ జగన్నాథ ఆలయం ముందు ఉన్న బడదండా రహదారిలో ఈ ఘటన జరిగింది. మారిచికోటే ప్రాంతం వద్ద అంబులెన్స్‌కు దారి కల్పించేందుకు భక్తులను పక్కకు జరిపే ప్రయత్నంలో ఒక్కసారిగా జనసందోహం అదుపు తప్పింది. ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాటలాంటి పరిస్థితి ఏర్పడింది. పలువురికి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న సహాయక బృందాలు వెంటనే సహాయక చర్యలు చేపట్టాయి.

### ఇద్దరు మృతి.. వంద మందికి చికిత్స

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనిల్ దాస్ అనే 35 ఏళ్ల భక్తుడు మృతి చెందాడు. మరో మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. సుమారు వంద మంది భక్తులు చికిత్స కోసం ఆసుపత్రిలో చేరినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువ మంది ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వెల్లడించారు. ఉదయం నుంచి ఒడిశా అగ్నిమాపక శాఖ ప్రత్యేక సహాయక బృందం భారీ రద్దీలో చిక్కుకున్న 33 మంది భక్తులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. వారికి ప్రథమ చికిత్సతో పాటు ఆక్సిజన్ అందించారు.

### వర్షంలోనూ లక్షలాది భక్తులు

ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ లక్షలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. ఆలయం నుంచి గుండిచా ఆలయం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల బడదండా రహదారి పూర్తిగా భక్తులతో నిండిపోయింది. సంప్రదాయ పూజలు ముగిసిన తర్వాత శ్రీ బలభద్రుడు, శ్రీ జగన్నాథుడు, దేవి సుభద్ర విగ్రహాలను ఆలయం వెలుపలికి తీసుకువచ్చారు. "హరిబోల్" నినాదాలు, శంఖధ్వనుల మధ్య మూడు రథాలు ముందుకు కదిలాయి. భక్తులు దేవతల దర్శనం కోసం పెద్దఎత్తున పోటీపడ్డారు.

### భద్రతపై ప్రశ్నలు

ఘటనపై మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మెరుగైన జనసందోహ నియంత్రణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రథాలు గుండిచా ఆలయానికి పూర్తిగా చేరకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. శుక్రవారం రథయాత్రను తిరిగి కొనసాగించనున్నారు. ఈ ఘటనతో భక్తుల భద్రత, జనసందోహ నియంత్రణపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.

# ఏపీలో స్థానిక సమరం ఖరారు

(మొదటి పేజీ తరువాయి..)

స్థానిక ఎన్నికలకు ముందే ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఎన్నికల వ్యూహంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల రాజకీయాలు వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

# సైబర్ నేరాలపై డీజీపీ హెచ్చరిక

- 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్‌గా మారనున్నాయని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్ష నిర్వహించిన ఆయన, మోసాల వల్ల అనేక కుటుంబాలు జీవితకాల పొదుపును కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2025లో రాష్ట్రంలో సైబర్ మోసాల కారణంగా రూ.1,524 కోట్ల నష్టం నమోదైనట్లు తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌తో హైదరాబాద్‌ను మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

# గోల్కొండలో బోనాల వేడుక

## అమ్మవారికి తొలి బోనం సమర్పణ

తెలంగాణలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోల్కొండ కోటలోని శ్రీ జగదంబ మహంకాళి ఆలయంలో తొలి బోనం సమర్పణతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలతో గోల్కొండ పరిసరాలు భక్తి పారవశ్యంతో కళకళలాడాయి.



### అన్ని ఏర్పాట్లు పూర్తి



దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని మూడు వేలకుపైగా దేవాలయాల్లో బోనాల వేడుకలు అట్టహాసంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచింది.

### అమ్మవారిని దర్శించుకున్న ఈటల

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ గోల్కొండ కోటలోని శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించిన అనంతరం తెలంగాణ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. బోనాలు తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప పండుగ అని పేర్కొన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆచారం తెలంగాణ ప్రత్యేకతను చాటుతోందని అన్నారు.



### తెలంగాణ సంస్కృతికి ప్రతీక

గోల్కొండలో కుమ్మర సమాజానికి చెందిన మహిళలు తొలి బోనం సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని ఈటల రాజేందర్ చెప్పారు. అక్కడి నుంచి లష్కర్ బోనాలు ప్రారంభమై హైదరాబాద్ నగరమంతా, తర్వాత గ్రామీణ ప్రాంతాలకు ఈ ఉత్సవాలు విస్తరిస్తాయని వివరించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయం, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని భక్తులు ప్రార్థిస్తారని అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించే మహత్తర సంప్రదాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, సస్యశ్యామలతతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.

# వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడండి

- ప్రాణ రక్షణే మొదటి బాధ్యత
- కేంద్రానికి హైకోర్టు కీలక ఆదేశం



సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రతి వైద్య చర్యను వెంటనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రతి పౌరుడి ప్రాణం అమూల్యమని స్పష్టం చేసిన న్యాయస్థానం, పరిస్థితి విషమిస్తే ఆలస్యం చేయకుండా వైద్య జోక్యం ఉండాలని పేర్కొంది. ప్రభుత్వం రోజువారీగా ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించింది.

### 19వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా సోనం వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ప్రస్తుతం దీక్ష 19వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు అత్యవసరంగా స్పందించింది. మరో 48 గంటల్లో దీక్ష విరమించకపోతే ప్రాణాపాయం తలెత్తే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### 8.5 కిలోల బరువు తగ్గినట్లు పిటిషన్

దీక్ష కారణంగా సోనం వాంగ్‌చుక్ ఇప్పటికే 8.5 కిలోల బరువు కోల్పోయినట్లు పిటిషన్‌లో వివరించారు. అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ద్రవాహారం రూపంలో పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు అందించాలని కోరారు. ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని పిటిషన్ స్పష్టం చేసింది. అలాంటి పరిస్థితిలో ఆయన మరణిస్తే దేశానికి, ప్రపంచానికి అవమానంగా మారుతుందని అభిప్రాయపడింది.

### వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి

విచారణ సందర్భంగా సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రభుత్వ వైద్యులు క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రతిరోజూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కేంద్రం తెలిపింది. అయితే కొన్ని సందర్భాల్లో ప్రైవేటు వైద్యులు కూడా పరీక్షలు చేస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ప్రభుత్వ వైద్యుల ద్వారానే ప్రతిరోజూ ఆరోగ్య పరీక్షలు జరగాలని, అవసరమైన మందులు వెంటనే అందించాలని ఆదేశించింది.

### దీక్ష విరమించేది లేదన్న వాంగ్‌చుక్

హైకోర్టు విచారణకు ముందు విడుదల చేసిన వీడియోలో సోనం వాంగ్‌చుక్ తన ఆరోగ్యంపై స్పందించారు. నిరాహార దీక్షలో ఉన్న వ్యక్తికి ఉండే బలహీనత తప్ప ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన లేకుండా దీక్ష విరమిస్తే తప్పు సంకేతం వెళ్తుందని స్పష్టం చేశారు. జూలై 20న ఢిల్లీలో జరగనున్న నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రజల స్వరం ప్రజాప్రతినిధుల వరకు చేరితేనే సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# వన్‌ప్లస్ ఇండియా వీడుతుందా?

- మార్కెట్‌లో ఊహాగానాలు
- భారత్‌లో కార్యకలాపాలు కొనసాగుతాయా?
- అసలు విషయం చెప్పిన కంపెనీ

వన్‌ప్లస్ భారత్‌ను వీడబోతోందన్న వార్తలపై కంపెనీ స్పష్టమైన ప్రకటన చేసింది. దేశంలో తమ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని వెల్లడించింది. వ్యాపార నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేదని తెలిపింది. ధృవీకరణ లేని కథనాలను ప్రచారం చేసే ముందు మీడియా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. దీంతో గత కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఊహాగానాలకు కంపెనీ సమాధానం ఇచ్చినట్లైంది.

### బ్లూమ్‌బర్గ్ కథనంతో చర్చ

బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం వన్‌ప్లస్ అమెరికా, యూరప్ మార్కెట్ల నుంచి ఈ ఏడాదిలోనే వైదొలిగే అవకాశముందని పేర్కొంది. 2027 నాటికి భారత్‌లో కూడా కార్యకలాపాలు నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ కథనం వెలువడిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో చర్చ మొదలైంది. ముఖ్యంగా భారత్‌లోని వన్‌ప్లస్ వినియోగదారుల్లో సందేహాలు నెలకొన్నాయి.

### ఉత్తర అమెరికా, యూరప్‌లో కొత్త ఉత్పత్తులు లేవు

ఉత్తర అమెరికా, యూరప్ మార్కెట్లలో కొత్త ఉత్పత్తులను విడుదల చేయబోమని వన్‌ప్లస్ తెలిపింది. అయితే భారత్‌లో వ్యాపార కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌కు సంబంధించిన సేవలు, విక్రయాలు, వినియోగదారుల మద్దతు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది.



### ఒప్పో పునర్వ్యవస్థీకరణ ప్రభావం

బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం వన్‌ప్లస్ మాతృసంస్థ ఒప్పో చేపడుతున్న పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు మందగించడం, తయారీ ఖర్చులు పెరగడం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు కఠినంగా మారడం కంపెనీపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. ముఖ్యంగా చైనా ఉత్పత్తులపై అమెరికా కఠిన వైఖరి కూడా కీలక అంశంగా మారిందని నివేదికలు సూచిస్తున్నాయి.

### సాఫ్ట్‌వేర్‌లో కీలక మార్పు

వన్‌ప్లస్‌కు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఆక్సిజన్‌ఓఎస్ స్థానంలో ఒప్పో కలర్‌ఓఎస్‌ను తీసుకురావాలని కంపెనీ నిర్ణయించినట్లు వెల్లడించింది. వినియోగదారులకు మెరుగైన సమగ్ర అనుభవం అందించడమే లక్ష్యమని తెలిపింది. ఈ మార్పు కంపెనీ వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణలో భాగమని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్ వన్‌ప్లస్‌కు అతిపెద్ద విదేశీ మార్కెట్‌గా కొనసాగుతోంది. అందువల్ల భారత కార్యకలాపాలు కొనసాగుతున్నాయని కంపెనీ ఇచ్చిన హామీ వినియోగదారులకు ఊరటనిచ్చింది.

# ₹150 కోట్ల ఆస్తి పంచాయితీ

- తండ్రినే కాల్చిచంపిన కొడుకు
- ఘాజియాబాద్‌లో దారుణం



ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్ జిల్లా మోదీనగర్‌లో ఆస్తి వివాదం దారుణ హత్యకు దారితీసింది. రూ.150 కోట్ల విలువైన ఆస్తులు కలిగిన రైతు హరియోమ్ చౌదరిని ఆయన పెద్ద కుమారుడు నిఖిల్ కాల్చిచంపినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన నిఖిల్‌కు తండ్రితో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో తుపాకీ తీసి వరుసగా కాల్పులు జరిపినట్లు విచారణలో వెల్లడైంది. ఘటన అనంతరం నిందితుడు ఆయుధంతో పరారయ్యాడు.

### ఇప్పటికే భారీ ఆస్తి ఇచ్చిన తండ్రి

52 ఏళ్ల హరియోమ్ చౌదరి మోదీనగర్ పరిసర ప్రాంతంలో ప్రముఖ రైతుగా గుర్తింపు పొందారు. ఆయనకు 75 బీఘాల వ్యవసాయ భూమి, ఢిల్లీ-మీరట్ రహదారిపై మార్కెట్ సముదాయం ఉన్నాయి. మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.150 కోట్లుగా పోలీసులు అంచనా వేశారు. ఇప్పటికే నిఖిల్‌కు మార్కెట్‌లో కొన్ని దుకాణాలు, 25 బీఘాల భూమి ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయినా మిగిలిన భూమిని కూడా తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని నిఖిల్ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

### తండ్రి నిరాకరణతో ఘర్షణ

మిగిలిన ఆస్తి ఇవ్వడానికి హరియోమ్ నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం అలవాటు కారణంగా ఆస్తిని వృథా చేస్తావని తండ్రి హెచ్చరించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. బుధవారం రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా, ఆలస్యంగా మద్యం మత్తులో వచ్చిన నిఖిల్‌తో మరోసారి వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో అతడు తుపాకీతో కాల్పులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### నాలుగు బుల్లెట్లు.. అక్కడికక్కడే మృతి

నిఖిల్ తొలుత తండ్రి ముఖంపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. హరియోమ్ నేలపై పడిపోవడంతో మరోసారి ముఖం, ఛాతీ, పొట్ట భాగాలపై కాల్పులు చేసినట్లు వెల్లడించారు. మృతదేహంపై నాలుగు నుంచి ఆరు బుల్లెట్ గాయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. హరియోమ్ భార్య అనిత, చిన్న కుమారుడు నీషూ ఘటనను చూసి షాక్‌కు గురయ్యారు. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

### గతంలో తమ్ముడిపైనా కాల్పులు

దర్యాప్తులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. 2018లో కూడా నిఖిల్ మద్యం మత్తులో తన తమ్ముడు నీషూపై కాల్పులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఘటనపై కూడా విచారణ కొనసాగుతోంది. మద్యం వ్యసనం, ఆస్తి వివాదాలు కలిసి ఈ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుటుంబ ఆస్తులపై వివాదాలు ఎంతటి విషాదాలకు దారి తీస్తాయో మరోసారి ఈ సంఘటన స్పష్టం చేసింది.

# నో సెకండ్ ఛాన్స్

## అవినీతిపై రాజీ లేదు
## మంత్రులకు విజయ్ వార్నింగ్




తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తన మంత్రివర్గ సహచరులకు అవినీతిపై కఠిన హెచ్చరిక జారీ చేశారు. శాఖల్లో అవినీతి, అక్రమాలు ఏ రూపంలో జరిగినా సహించబోనని స్పష్టం చేశారు. మంత్రివర్గ సమావేశానికి అధ్యక్షత వహించిన విజయ్, తప్పు చేసిన వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తర్వాత ఎవరూ తన నిర్ణయాన్ని ప్రశ్నించలేరని కూడా స్పష్టం చేసినట్లు సమాచారం.

### ప్రచారానికి దూరంగా ఉండాలి

ప్రభుత్వం కేవలం ఐదేళ్లు మాత్రమే అధికారంలో ఉంటుందనే భావనతో ఇష్టానుసారంగా వ్యవహరించవద్దని విజయ్ మంత్రులకు సూచించారు. రాష్ట్ర ప్రజల విశ్వాసంతో దీర్ఘకాలం పాలన కొనసాగించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు తావు ఇవ్వొద్దని హెచ్చరించారు. శాఖల పనుల పరిశీలన పేరుతో అనవసర ప్రచారం చేసుకోవద్దని మంత్రులకు విజయ్ సూచించినట్లు తెలిసింది. తనిఖీలను ఆర్భాటంగా మార్చకుండా ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించాలని చెప్పారు. ప్రజాసేవే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేలా ఉండాలని సూచించారు.

### అధికారులకూ హెచ్చరిక

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సహకరించని అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి విజయ్ హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సమర్థంగా అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

### పారదర్శక పాలనపై ఫోకస్

మంత్రివర్గ సమావేశంలో విజయ్ చేసిన వ్యాఖ్యలు తమిళనాడు ప్రభుత్వ పాలనా శైలిపై స్పష్టమైన సంకేతాలుగా భావిస్తున్నారు. అవినీతి రహిత పాలన, జవాబుదారీతనం, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఆయన మంత్రులకు ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి శాఖ పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా ముందుగానే అప్రమత్తంగా ఉండాలని మంత్రులు, అధికారులకు విజయ్ సూచించినట్లు సమాచారం.

# మూడో భాషపై సుప్రీంకోర్టు ప్రశ్నలు

## 9వ తరగతిలో ఒత్తిడి వద్దన్న ధర్మాసనం

9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే కీలక దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడి పెంచుతుందని వ్యాఖ్యానించింది. చిన్న తరగతుల నుంచే మూడో భాష బోధిస్తే విద్యార్థులకు అలవాటు అవుతుందని సూచించింది. సీబీఎస్ఈ మూడుభాషల విధానంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ అభిప్రాయం వెల్లడించింది. ప్రస్తుతం విధానాన్ని నిలిపివేయకపోయినా, 9వ తరగతిలో అమలుపై కేంద్ర ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని సూచించింది. ఈ అంశంపై కేంద్రం, సీబీఎస్ఈ తదుపరి విచారణలో తమ వైఖరిని వెల్లడించనున్నాయి.



# అమెరికా ఎన్నికలపై చైనా జోక్యం?..

## ట్రంప్ కొత్త ఆరోపణలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం జరిగే కీలక ప్రసంగంలో అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకుందని కొత్త ఆరోపణలు చేయనున్నట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. చైనా అమెరికా ఓటర్ల డేటాను సేకరించిందని, దీనిపై సీఐఏకు సమాచారం ఉన్నప్పటికీ తనకు తెలియజేయలేదని ట్రంప్ చెప్పే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ ప్రసంగంపై వస్తున్న కథనాలను వైట్ హౌస్ అధికార ప్రతినిధి ఖండించారు. మరోవైపు 2021లో విడుదలైన అమెరికా నిఘా నివేదిక ప్రకారం 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు చైనా ప్రయత్నించినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యానికి ఎలాంటి నిర్ధారణ కాలేదని కూడా ఆ నివేదిక పేర్కొంది.






## ఈనెల 22న తల్లికి వందనం

# నిధులు విడుదల

**లబ్ధిదారులకు ఊరట, ₹10,120 కోట్లకు ఆమోదం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం నిధులను జులై 22న విడుదల చేయనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ₹10,120.78 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జారీ చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు ఆర్థిక ఊరట లభించనుంది. (వివరాలు 5లో..)

# పీపీపీతో అభివృద్ధికి వేగం

- ప్రతి శాఖకు ఆర్థిక ప్రణాళిక
- వీజీఎఫ్ విప్లవానికి చంద్రబాబు శ్రీకారం



భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులే అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రతి ప్రాజెక్టు ఆర్థికంగా నిలదొక్కుకునేలా రూపొందించాలని ఆదేశించారు.

**• రూ.1.23 లక్షల కోట్ల ప్రాజెక్టులు**

ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, షిప్‌యార్డులు, విమానాశ్రయాలు, పర్యాటకం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ సహా 260 పీపీపీ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. వీటి మొత్తం విలువ రూ.1,23,229 కోట్లుగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ వంటి నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని చంద్రబాబు సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు. (5లో..)



## అమరావతిలో జగన్నాథ రథయాత్ర

**రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు**



# నీట్ రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

- 11.21 లక్షల మంది అర్హత
- ఫలితాలు ప్రకటించిన ఎన్‌టీఏ

నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ ఎన్‌టీఏ విడుదల చేసింది. వైద్య, దంత, ఆయుష్ సహా అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు మొత్తం 11.21 లక్షల మంది ~~అభ్యర్థులు అర్హత సాధించారు. జూన్ 21న నిర్వహించిన రీ~~ ఎగ్జామ్‌కు దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది హాజరయ్యారు. భారత్‌లో 551 నగరాలు, విదేశాల్లో 14 నగరాల్లో 5,440 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేలా ఫలితాలను ప్రకటించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. (వివరాలు 7లో..)




# కౌంట్ డౌన్ షురూ

**మోడీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూపు**

**నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం!**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించాలని ఇప్పటికే ఆహ్వానం పంపినట్లు వెల్లడించారు. (వివరాలు 7లో..)

# ఇస్రోలో రాజీనామాలు

**రచ్చ.. చర్చ అక్కర్లేదు • పోయేవాళ్లు పోతారు**

**వచ్చే వాళ్లు వస్తారు • కేంద్ర మంత్రి స్పష్టీకరణ**

ఇస్రోలో శాస్త్రవేత్తల రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణలపై వస్తున్న చర్చను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కొట్టిపారేశారు. ఇది పూర్తిగా పరిపాలనా నిర్ణయమని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తల రాజీనామాల వెనుక ఎలాంటి వివాదం లేదన్నారు. సంస్థలో కొంతమంది బయటకు వెళ్తుంటే, కొత్తవారు చేరడం కూడా సహజ ప్రక్రియేనని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అనవసరంగా పెద్దది చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. (5లో..)






# కడప గొడవలపై లోకేశ్ షాక్ ట్రీట్మెంట్

## నేతలకు వార్నింగ్.. వినకుంటే పనిష్మెంట్

**పార్టీని దెబ్బతీసేవారికి నో స్పేస్ • హీట్ పెంచేసిన లోకేశ్ పోస్టుమార్టమ్**

కడప అంటే ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలకు చిరునామా. ఇప్పుడు అదే జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీలో పెరుగుతున్న అంతర్గత విభేదాలు అధిష్టానానికి కొత్త సవాల్‌గా మారాయి. నాయకుల మధ్య ఆధిపత్య పోరు, కార్యకర్తల మధ్య ఘర్షణలు, సోషల్ మీడియాలో బహిరంగ విమర్శలు, ఇంచార్జ్‌లపై వరుస ఫిర్యాదులు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయనే భావన బలపడుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల కడప పర్యటన కేవలం అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాలేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా పరిస్థితులపై క్షేత్రస్థాయిలో ఆరా తీసిన ఆయన, వర్గ రాజకీయాలకు ఇకపై తావులేదని నేతలకు స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ కంటే వ్యక్తులు, వర్గాలు పెద్దవి కావని, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవన్న సంకేతాలు పంపినట్లు చర్చ జరుగుతోంది. రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో కడపలో పార్టీని ఏకతాటిపై నడిపించడమే లక్ష్యంగా లోకేశ్ ఈ "షాక్ ట్రీట్మెంట్" అమలు చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజా సమస్యలే అజెండా




## 'జగన్ 2.ఓ' సూపర్ యాప్ ఆవిష్కరణ

**వైసీపీ కార్యకర్తలకు సొంత డిజిటల్ వేదిక**

- పార్లమెంట్‌లో పోరాడండి
- ఎంపీలకు జగన్ దిశానిర్దేశం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా గాడితప్పిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రజల సమస్యలను ఉభయసభల్లో బలంగా ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు సూచించారు. తాడేపల్లిలో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సమావేశాలకు అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృతంగా చర్చించారు. ప్రజల తరఫున గట్టిగా పోరాడాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.



# గ్రీన్ రైలుకు శ్రీకారం

- దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం
- నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

దేశంలోనే తొలి హైడ్రోజన్ ఇంధన సెల్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు హర్యానాలో ప్రారంభించనున్నారు. జింద్–సోనిపట్ మార్గంలో నడిచే ఈ రైలుకు "నమో గ్రీన్ రైల్ "గా పేరు పెట్టారు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ ప్రయాణికుల రైళ్లలో ఒకటిగా నిలుస్తోంది. పది బోగీలతో 3,200 హార్స్‌పవర్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. (వివరాలు 5లో..)

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**నేడు ఏపీకి వర్షాల హెచ్చరిక • అల్పపీడన ప్రభావంతో వానలు**

## అమర్‌రాజాకు బహిరంగ క్షమాపణ

**ఏపీలో పెట్టుబడులకు లోకేశ్ ఆహ్వానం**

తెలంగాణలో అమర్‌రాజా గ్రూప్ కొత్త కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ప్రారంభమైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో అమర్‌రాజా సంస్థ ఎదుర్కొన్న పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ తరఫున క్షమాపణ చెబుతున్నానని వెల్లడించారు. చిత్తూరు కేంద్రంగా ఎదిగిన ఈ సంస్థ ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చిందని ప్రశంసించారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిందని పేర్కొన్నారు.




# ఏపీలో స్థానిక సమరం ఖరారు

## సెప్టెంబర్‌లో మున్సిపల్ పోరు! • ఎన్నికల ప్రచారంపై టీడీపీ ఫోకస్




ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తొలి దశలో సెప్టెంబర్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇప్పటికే ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి, చివరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం ప్రాథమిక ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

**• డోర్ టు డోర్ ప్రచారానికి ఆదేశాలు**

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 45 రోజుల పాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచారానికి అనుసంధానం చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది.



# నో సెకండ్ ఛాన్స్

- అవినీతిపై రాజీ లేదు
- మంత్రులకు విజయ్ వార్నింగ్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తన మంత్రివర్గ సహచరులకు అవినీతిపై కఠిన హెచ్చరిక జారీ చేశారు. శాఖల్లో అవినీతి, అక్రమాలు ఏ రూపంలో జరిగినా సహించబోనని స్పష్టం చేశారు. మంత్రివర్గ సమావేశానికి అధ్యక్షత వహించిన విజయ్, తప్పు చేసిన వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తర్వాత ఎవరూ తన నిర్ణయాన్ని ప్రశ్నించలేరని కూడా స్పష్టం చేసినట్లు సమాచారం. (వివరాలు 3లో..)



# ఆరోగ్యంపై ఆరా

- పవన్‌ను పరామర్శించిన గవర్నర్
- త్వరగా కోలుకోవాలని నజీర్ ఆకాంక్ష

కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ నివాసానికి వెళ్లిన గవర్నర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. (వివరాలు 5లో..)



# గ్రీన్ రైలుకు శ్రీకారం

- దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం
- నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

దేశంలోనే తొలి హైడ్రోజన్ ఇంధన సెల్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు హర్యానాలో ప్రారంభించనున్నారు. జింద్-సోనిపట్ మార్గంలో నడిచే ఈ రైలుకు "నమో గ్రీన్ రైల్"గా పేరు పెట్టారు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ ప్రయాణికుల రైళ్లలో ఒకటిగా నిలుస్తోంది. పది బోగీలతో 3,200 హార్స్‌పవర్ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

### హైడ్రోజన్‌తోనే విద్యుత్ ఉత్పత్తి

సాంప్రదాయ రైళ్లతో పోలిస్తే ఈ రైలు ప్రత్యేకత పూర్తిగా భిన్నంగా ఉంటుంది. హైడ్రోజన్, వాతావరణంలోని ఆక్సిజన్ మధ్య జరిగే రసాయనిక చర్య ద్వారా రైలు స్వయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. కాలుష్యానికి కారణమయ్యే పొగ లేదా హానికర వాయువులు విడుదల కాకుండా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. పర్యావరణ హిత రవాణా వ్యవస్థలో ఇది కీలక ముందడుగుగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

### రూ.25 వేల కోట్ల అభివృద్ధి పనులు

హర్యానా, చండీగఢ్, పంజాబ్‌లలో జరిగే రోజు పర్యటనలో ప్రధానమంత్రి రూ.25 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. హర్యానాలో రూ.12,470 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేలో కీలక భాగాన్ని ప్రారంభించనున్నారు. ఈ రహదారి పూర్తయితే ఢిల్లీ నుంచి కత్రాకు ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు తగ్గనుంది. జింద్-గోహానా గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా ప్రారంభం కానుంది.


### వైద్యం, రైల్వేలకు ప్రాధాన్యం

చండీగఢ్‌లో రూ.4,700 కోట్ల విలువైన వైద్య, రహదారి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు. పీజీఐఎంఈఆర్‌లో అత్యాధునిక తల్లి-శిశు వైద్య కేంద్రం, న్యూరో సైన్సెస్ కేంద్రాన్ని దేశానికి అంకితం చేయనున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జలంధర్‌లో 20 రాష్ట్రాల్లో పునర్నిర్మించిన 75 ఆధునిక రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

### కనెక్టివిటీకి కొత్త ఊపు

పంజాబ్‌లో కొత్త రైల్వే మార్గాలు, రైలు సర్వీసులను కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. కర్తోలీ-అంబాలా, అమృత్‌సర్-వారణాసి కొత్త రైళ్లకు పచ్చజెండా ఊపనున్నారు. ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేలో మరో కీలక భాగాన్ని ప్రారంభించడంతో పాటు లూథియానా దక్షిణ బైపాస్‌కు శంకుస్థాపన చేయనున్నారు. హైడ్రోజన్ రైలు ప్రారంభంతో పాటు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ఆవిష్కరణ దేశంలో పర్యావరణహిత రవాణా, వేగవంతమైన కనెక్టివిటీ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త దిశగా నిలవనుంది.

# పీపీపీతో అభివృద్ధికి వేగం



(మొదటి పేజీ తరువాయి..)

ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0ను వచ్చే కేబినెట్‌లో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరగా విడుదల చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కొత్త విధానాన్ని రూపొందించాలని అధికారులకు చెప్పారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

### ప్రతి శాఖకు ఆర్థిక ప్రణాళిక

ప్రభుత్వంలోని ప్రతి శాఖ తప్పనిసరిగా ప్రత్యేక ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఆదాయ వనరులను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలకు నీటి సరఫరా ద్వారా జలవనరుల శాఖకు కూడా ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచే విధంగా పీపీపీ ప్రాజెక్టులను అమలు చేయాలని స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం

ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ప్రభుత్వ భూములను వాణిజ్యపరంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. పంప్డ్ స్టోరేజ్, సౌర విద్యుత్, గనులు, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో కూడా పీపీపీ విధానాన్ని విస్తరించాలని చెప్పారు. బలహీన వర్గాల విద్యార్థులకు మినీ టౌన్‌షిప్‌ల తరహాలో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. రాష్ట్రాన్ని 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో పీపీపీ, వీజీఎఫ్ విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

# అమరావతిలో జగన్నాథ రథయాత్ర

- రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు




రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రమ్మల రథాన్ని భక్తులతో కలిసి లాగారు. పూరీ రథయాత్రకు దేశంలో ఎంతో విశిష్టత ఉందని, అలాంటి కార్యక్రమం అమరావతిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఈ రథయాత్రను నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు.

### ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవితం

ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సమాజంలో ఒత్తిడి, మానసిక ఆందోళనలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి నుంచి బయటపడేందుకు ఆధ్యాత్మికతే ఉత్తమ మార్గమని చెప్పారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి ప్రతీక అని, కుటుంబ విలువలను కాపాడుకోవాలని సూచించారు. ఇస్కాన్, అక్షయపాత్ర వంటి సంస్థలు ప్రజాసేవతో పాటు ఆధ్యాత్మిక సేవ కూడా చేస్తున్నాయని ప్రశంసించారు.

### అమరావతి, పోలవరం పూర్తి చేస్తాం

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమంతో పాటు భారతీయ సంస్కృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఐదు వేల శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జగన్నాథ స్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

Thalliki Vandanam Scheme

# 22న తల్లికి వందనం నిధులు విడుదల

- లబ్ధిదారులకు ఊరట,
- ₹10,120 కోట్లకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం నిధులను జులై 22న విడుదల చేయనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ₹10,120.78 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జారీ చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు ఆర్థిక ఊరట లభించనుంది.

### ఒక్కో విద్యార్థికి ₹15 వేల సాయం

ఈ పథకం కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి ఒక్కొక్కరికి ₹15 వేల ఆర్థిక సహాయం అందించనున్నారు. ఇందులో ₹13 వేల మొత్తాన్ని నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. మిగిలిన ₹2 వేల మొత్తాన్ని పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి అవసరాల కోసం వినియోగించనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 67.47 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. మొత్తం 42.70 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అర్హులైన లబ్ధిదారుల ఖాతాలను ఇప్పటికే అధికారులు ధృవీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది.

### 22న జాబితా ప్రదర్శన

జులై 22న స్వర్ణ గ్రామాలు, వార్డు కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించనున్నారు. అదే రోజు అర్హులైన తల్లుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. పారదర్శకంగా అమలు జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. కొత్తగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అర్హత పరిశీలన పూర్తయిన తర్వాత ఆగస్టు 30లోపు ఆర్థిక సాయం అందించనున్నారు. కొత్త ప్రవేశాలు కూడా ఈ పథకం పరిధిలోకి రావడంతో మరింత మంది విద్యార్థులు లబ్ధి పొందే అవకాశం ఏర్పడింది.



# ఆరోగ్యంపై ఆరా

- పవన్‌ను పరామర్శించిన గవర్నర్
- త్వరగా కోలుకోవాలని నజీర్ ఆకాంక్ష

కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ నివాసానికి వెళ్లిన గవర్నర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్ పవన్ కళ్యాణ్ నివాసంలోని లైబ్రరీని సందర్శించారు. అక్కడ ఉన్న పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. సమకాలీన సామాజిక అంశాలు, పరిపాలన, ప్రజా విధానాలపై పవన్‌తో చర్చించారు. పవన్ అభ్యర్థన మేరకు ఒక పుస్తకంపై గవర్నర్ తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా ఇంటికి వచ్చిన గవర్నర్‌కు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. అనంతరం ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# అమర్‌రాజాకు బహిరంగ క్షమాపణ

- ఏపీలో పెట్టుబడులకు లోకేశ్ ఆహ్వానం



తెలంగాణలో అమర్‌రాజా గ్రూప్ కొత్త కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ప్రారంభమైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో అమర్‌రాజా సంస్థ ఎదుర్కొన్న పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ తరపున క్షమాపణ చెబుతున్నానని వెల్లడించారు. చిత్తూరు కేంద్రంగా ఎదిగిన ఈ సంస్థ ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చిందని ప్రశంసించారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిందని పేర్కొన్నారు.

### ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో అమర్‌రాజా సంస్థ వేధింపులకు గురైందని లోకేశ్ ఆరోపించారు. స్వరాష్ట్రంలో ప్రోత్సాహం పొందాల్సిన పరిశ్రమకు ఇబ్బందులు కల్పించడం వల్ల రూ.9,500 కోట్ల లిథియంఅయాన్ ప్రాజెక్టు తెలంగాణకు వెళ్లిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఇది చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయినట్లేనని అభిప్రాయపడ్డారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరిస్తోందని లోకేశ్ స్పష్టం చేశారు. అమర్‌రాజా భవిష్యత్తులో ఏ ప్రాజెక్టు చేపట్టాలనుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర తలుపులు మాత్రమే కాదు, తమ హృదయాలు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయని వ్యాఖ్యానించారు. పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

### పెట్టుబడులకు కొత్త సందేశం

అమర్‌రాజా వంటి సంస్థలు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని లోకేశ్ పేర్కొన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహం, స్థిరమైన విధానాలు, పారదర్శక పాలన ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు విస్తరిస్తే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా బలమైన ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలే అజెండా

- పార్లమెంట్‌లో పోరాడండి
- ఎంపీలకు జగన్ దిశానిర్దేశం




రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా గాడితప్పిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రజల సమస్యలను ఉభయసభల్లో బలంగా ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు సూచించారు. తాడేపల్లిలో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సమావేశాలకు అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృతంగా చర్చించారు. ప్రజల తరపున గట్టిగా పోరాడాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

### డీఎస్సీపై స్కామ్ ఆరోపణలు

రాష్ట్రంలో డీఎస్సీ-2025 నియామకాలలో భారీ స్కామ్ జరిగిందని జగన్ ఆరోపించారు. పోటీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇచ్చారంటూ విమర్శించారు. పరీక్ష పత్రాల లీకేజీపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలలో ప్రత్యేక జీవోల ద్వారా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కొన్ని క్రీడా సంఘాల ద్వారా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తాలని ఎంపీలకు సూచించారు.

### భూములు, ప్రైవేటీకరణపై విమర్శలు

ప్రభుత్వ భూములను భారీ స్థాయిలో కేటాయిస్తున్నారని జగన్ ఆరోపించారు. అమరావతి నిర్మాణంలో భారీ వ్యయాలు చూపుతూ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. భూముల పూలింగ్‌కు అంగీకరించని రైతులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. ఇప్పటికే పూర్తికి చేరుకున్న రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులను ప్రైవేటుకు అప్పగించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా ఆస్తులను ప్రైవేటీకరించడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఆదాయాలు దెబ్బతింటాయని అన్నారు.

### అరెస్టులు, అప్పులపై ఆందోళన

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని జగన్ ఆరోపించారు. సోషల్ మీడియా పోస్టుల పేరుతో వేధింపులు పెరిగాయని విమర్శించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని అన్నారు. రెండేళ్లలో రూ.3.6 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని ఆరోపించారు. ఇసుక, మద్యం, గనుల రంగాల్లో అవినీతి పెరిగిందని కూడా విమర్శించారు.

### రైతులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏలు, సరెండర్ లీవ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. టెట్ నిబంధనల వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పార్లమెంట్‌లో బలంగా వినిపించి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ ఎంపీలకు జగన్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

## 'జగన్ 2.ఓ' సూపర్ యాప్ ఆవిష్కరణ

### వైసీపీ కార్యకర్తలకు సొంత డిజిటల్ వేదిక

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పార్టీ నాయకత్వంతో నేరుగా అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'జగన్ 2.ఓ సూపర్‌యాప్'ను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ కార్యక్రమాలు, సమాచార మార్పిడి, సమస్యల పరిష్కారం కోసం ఈ యాప్ ఒకే వేదికగా పనిచేస్తుందని తెలిపారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు అందరినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే దీని ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

### కార్యకర్తలకు నేరుగా అనుసంధానం

సామాజిక మాధ్యమాల్లో పార్టీ కార్యకర్తలు చేస్తున్న పోస్టులకు ఆటంకాలు ఎదురవుతున్న నేపథ్యంలో సొంత డిజిటల్ వేదికను రూపొందించినట్లు జగన్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రతి కార్యకర్త నిర్భయంగా తన అభిప్రాయాన్ని వెల్లడించవచ్చని చెప్పారు. పార్టీ సమావేశాలు, ప్రెస్‌మీట్లు, ముఖ్యమైన ప్రకటనలు, కార్యక్రమాల వివరాలు లైవ్ ఫీడ్ రూపంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

### ఫిర్యాదులకు ప్రత్యేక అవకాశం

ప్రజా సమస్యలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీసు వేధింపులు, రాజకీయ ఒత్తిళ్లను నేరుగా యాప్‌లో నమోదు చేసే అవకాశం కల్పించినట్లు జగన్ తెలిపారు. పార్టీ నిర్వహిస్తున్న డిజిటల్ డైరీని కూడా ఈ యాప్‌తో అనుసంధానించినట్లు చెప్పారు. దీంతో కార్యకర్తల ఫిర్యాదులపై పార్టీ వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.




### పార్టీకి సొంత డిజిటల్ ప్లాట్‌ఫామ్

ఇతర సామాజిక మాధ్యమాల్లో పార్టీపై జరిగే తప్పుడు ప్రచారాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొంటూనే ఉంటామని జగన్ స్పష్టం చేశారు. అదే సమయంలో ఎలాంటి బాహ్య జోక్యం లేకుండా వైఎస్సార్‌సీపీకి సొంత డిజిటల్ వేదికగా 'జగన్ 2.ఓ సూపర్‌యాప్' పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కార్యకర్తల అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఫీచర్లు జోడించి యాప్‌ను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ వేదిక ద్వారా పార్టీతో కార్యకర్తల అనుసంధానం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇస్రోలో రాజీనామాలు

- రచ్చ.. చర్చ అక్కర్లేదు
- పోయేవాళ్లు పోతారు
- వచ్చే వాళ్లు వస్తారు
- కేంద్ర మంత్రి స్పష్టీకరణ

ఇస్రోలో శాస్త్రవేత్తల రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణలపై వస్తున్న చర్చను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కొట్టిపారేశారు. ఇది పూర్తిగా పరిపాలనా నిర్ణయమని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తల రాజీనామాల వెనుక ఎలాంటి వివాదం లేదన్నారు. సంస్థలో కొంతమంది బయటకు వెళ్తుంటే, కొత్తవారు చేరడం కూడా సహజ ప్రక్రియేనని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అనవసరంగా పెద్దది చేయాల్సిన అవసరం లేదని చెప్పారు.

### మిషన్లు ఆగవని స్పష్టం

భారత్ భవిష్యత్ అంతరిక్ష కార్యక్రమాలపై ప్రశ్నించగా జితేంద్ర సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. మనిషిని అంతరిక్షంలోకి పంపడం కంటే సురక్షితంగా తిరిగి తీసుకురావడం మరింత క్లిష్టమని అప్పుడే వివరించారని చెప్పారు. అదే ఆలోచనతో గగన్‌యాన్ కార్యక్రమం రూపుదిద్దుకుందని తెలిపారు. ప్రస్తుతం సోమనాథ్ పదవిలో లేకపోయినా గగన్‌యాన్ ప్రాజెక్టు ఆగలేదని స్పష్టం చేశారు.

### ఇస్రోలో కొనసాగింపు సంస్కృతి

ఇస్రోలో పని చేసే విధానం ఇతర సంస్థలతో పోలిస్తే భిన్నంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఒక శాస్త్రవేత్త పదవీ విరమణ చేసినంత మాత్రాన ప్రాజెక్టులు నిలిచిపోవని చెప్పారు. పదవీ విరమణ చేసిన శాస్త్రవేత్తలు కూడా అవసరమైన సందర్భాల్లో ప్రాజెక్టులకు తమ అనుభవాన్ని అందిస్తూనే ఉంటారని వివరించారు. సంస్థలో పనులన్నీ నిరంతర కొనసాగింపు విధానంలో సాగుతాయని చెప్పారు.

### గగన్‌యాన్‌కు కీలక ఆదేశాలు

జూలై 14న అంతరిక్ష శాఖ ఇస్రోకు చెందిన ప్రధాన కేంద్రాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. గగన్‌యాన్ వంటి అత్యంత కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్రవేత్తల రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను సాధారణంగా ఆమోదించవద్దని సూచించింది. ఈ నిర్ణయం పూర్తిగా పరిపాలనా అవసరాల కోసమే తీసుకున్నదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రాజెక్టుల నిరంతర పురోగతిని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది.


### కూడంకుళం అంశంపైనా స్పందన

కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ అంశంపైనా జితేంద్ర సింగ్ స్పందించారు. ఆ ఘటనకు అణు భద్రతతో ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఎన్‌పీసీఐఎల్, సీఈఆర్‌టీఐఎన్ దర్యాప్తు కొనసాగిస్తున్నాయని తెలిపారు. కూడంకుళంలో ప్రస్తుతం రెండు వెయ్యి మెగావాట్ల రియాక్టర్లు పనిచేస్తున్నాయి. మరో నాలుగు యూనిట్ల నిర్మాణం కొనసాగుతోంది. అవి పూర్తయితే మొత్తం 6,000 మెగావాట్ల సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద అణు విద్యుత్ పార్కుగా కూడంకుళం నిలవనుంది.

# కడప గొడవలపై లోకేష్ షాక్ ట్రీట్మెంట్

## నేతలకు వార్నింగ్.. వినకుంటే పనిష్మెంట్







- » పార్టీని దెబ్బతీసేవారికి నో స్పేస్
- » వర్గ రాజకీయాలు చేసేవారికి ఉద్వాసన
- » హీట్ పెంచేసిన లోకేశ్ పోస్టుమార్టమ్

**రాయలసీమ అంటే రగడకు వెనుకాడని నేల. కడప అంటే కక్షలు, కరవాలాలు, మాటకు మాట నిలిచే మనస్తత్వం గుర్తొచ్చే జిల్లా. ఒకసారి మనిషిని నమ్మితే ప్రాణం పెట్టే స్వభావం... నచ్చకపోతే ఎదురెళ్లే తెగువ. అలాంటి నేలపై రాజకీయాలు కూడా అంతే వేడిగా సాగుతాయి. ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న కడప... తర్వాత వైఎస్ కుటుంబానికి అజేయ కోటగా నిలిచింది. ఇప్పుడు అదే కడపలో ప్రత్యర్థుల పోరు కాదు... అధికార తెలుగుదేశం పార్టీలోనే వర్గాల మధ్య రగులుతున్న చిచ్చు అధిష్ఠానానికి ఆందోళన కలిగిస్తోంది. నాయకుల ఆధిపత్య పోరు, కార్యకర్తల మధ్య విభేదాలు, ఇంచార్జీలపై వరుస ఫిర్యాదులు, సోషల్ మీడియాలోనే బహిరంగ యుద్ధాలు... ఇవన్నీ పార్టీ ప్రతిష్ఠపై మచ్చ వేస్తున్నాయనే భావన బలపడుతోంది. ఇలాంటి వేళ రెండు రోజుల పాటు కడప జిల్లాలో మంత్రి నారా లోకేశ్ చేసిన పర్యటనకు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పైకి చూస్తే అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సమావేశాలే కనిపించినా... లోపల మాత్రం "వర్గాలా... పార్టీనా?" అనే ప్రశ్నకు నాయకత్వం స్పష్టమైన సమాధానం చెప్పిందనే చర్చ సాగుతోంది. కడప గడ్డపై క్రమశిక్షణకు గీత గీస్తూ, పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదన్న సందేశాన్ని లోకేశ్ గట్టిగా వినిపించారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.**

కడప... ఈ పేరు వినగానే ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలు గుర్తొచ్చేవి. ఆ తర్వాత వైఎస్ కుటుంబానికి అజేయ కోటగా మారిన జిల్లా అనే గుర్తింపు వచ్చింది. ఇప్పుడు అదే కడప మరోసారి రాజకీయ చర్చలకు కేంద్రబిందువైంది. అయితే ఈసారి కారణం ప్రత్యర్థి పార్టీ కాదు... అధికార తెలుగుదేశం పార్టీలోనే పెరుగుతున్న వర్గపోరు. నాయకుల మధ్య ఆధిపత్య పోరు, కార్యకర్తల మధ్య విభేదాలు, ఇంచార్జ్‌లపై ఫిర్యాదులు, స్థానికంగా ఏర్పడిన ముఠా రాజకీయాలు... ఇవన్నీ కలిసి కడప టీడీపీని ఇబ్బందుల్లోకి నెట్టే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. అలాంటి సమయంలోనే మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటించడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పైకి చూస్తే అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సమావేశాలు, కార్యకర్తలతో భేటీలు కనిపించినా... లోపల మాత్రం మొత్తం పర్యటన "పార్టీని కాపాడే ఆపరేషన్"గా సాగిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ నిరంతరం దేశ విదేశాల్లో పెట్టుబడుల కోసం పర్యటిస్తున్నారు. ప్రపంచ స్థాయి రాజధాని అమరావతిని నిర్మించాలన్న లక్ష్యంతో ఎన్నో సంస్థలను, పెట్టుబడిదారులను కలుస్తున్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు తీసుకురావడంపై దృష్టి పెడుతున్నారు. అదే సమయంలో రాజకీయంగా అత్యంత క్లిష్టమైన జిల్లాల్లో ఒకటైన కడపపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం గమనార్హం.

**• కడపపై ఫోకస్ పెంచిన టీడీపీ అధిష్ఠానం**

ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండేళ్లలో చంద్రబాబు, లోకేశ్ కలిసి గానీ, విడివిడిగా గానీ పలు మార్లు కడప జిల్లాకు వచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పరిశ్రమల విస్తరణకు శంకుస్థాపనలు చేశారు. రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన ప్రకటనలు చేశారు. అంతేకాదు, 2025లో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మహానాడును కూడా మూడు రోజుల పాటు కడపలోనే నిర్వహించి రాజకీయంగా స్పష్టమైన సందేశం ఇచ్చారు. "కడపను వదిలిపెట్టం... ఈ కోటలోనూ పార్టీని బలోపేతం చేస్తాం" అనే సంకేతాన్ని అప్పుడే పంపించారు. కానీ అధిష్ఠానం కడపను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తుంటే... స్థానిక నాయకత్వం మాత్రం వేరే దారిలో నడుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ విస్తరణ కంటే వ్యక్తిగత వర్గాల నిర్మాణం, కొత్త కార్యకర్తలను చేర్చుకోవడం కంటే పాత నాయకులను దూరం చేయడం, ప్రజా సమస్యల కంటే అంతర్గత ఆధిపత్య పోరాటాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే అసంతృప్తి కిందిస్థాయిలో పెరుగుతోంది. అంతేకాదు అక్రమ మార్గాల్లో ధనార్జన చేసుకునేందుకు వీలుగా అనుభవం ఉన్న పాత నేస్తాలను రంగంలోకి దింపుతున్నారనే బలమైన ఆరోపణలను సొంత పార్టీ కార్యకర్తల నుంచే ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలన్నీ ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి ఫిర్యాదుల రూపంలో కావచ్చు.. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా అందుతున్నట్టు తెలుస్తోంది. అందుకే చంద్రబాబు సహా చినబాబు సైతం కడప నేతలపై ఎప్పటికప్పుడు చెర్నాకోలా ను ఝులిపిస్తున్నారు.

**• గ్రూపు రాజకీయాలతో పార్టీకి తలనొప్పి**

ఒక రకంగా చెప్పాలంటే ఈ రకమైన వివాదాలు గత కొన్ని నెలలుగా కడప జిల్లా రాజకీయాలు టీడీపీకి తలనొప్పిగా మారాయి. తొలుత కడప నియోజకవర్గంలో మొదలైన విభేదాలు మరొక చోటికి వ్యాపించాయి. అక్కడి నుంచి మరోచోటికి.. ఇలా దాదాపుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దావానలం లా చిచ్చు రేగింది. చిన్న చిన్న మనస్పర్థలు సైతం చివరాఖరకు బహిరంగ ఆరోపణలు, ఫిర్యాదులు, సమావేశాల బహిష్కరణల వరకు వెళ్లాయి. పార్టీ కార్యక్రమాల కంటే గ్రూపు సమావేశాలే ఎక్కువగా జరుగుతున్నాయనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. రాజంపేటలో పరిస్థితి మరింత చర్చనీయాంశమైంది. అక్కడ టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుపై సొంత పార్టీ నాయకుల నుంచే అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రచారమే కాదు రోడ్డెక్కి విమర్శలు కాకుండా సోషల్ మీడియాలో బహిరంగంగా బండబూతులు తిట్టుకునే స్థాయికి పార్టీ నేతలు దిగజారారు. దీంతో అక్కడి పోలీస్ అధికారులు స్ట్రిక్ట్ వార్నింగ్‌లు జారీచేశారు. అరెస్టులు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పార్టీ ఇంచార్జ్ అనుచరుల పేరుతో జరుగుతున్న కొన్ని వ్యవహారాలపై అధిష్ఠానానికి వరుసగా ఫిర్యాదులు వెళ్తున్నాయనే చర్చ బలంగా వినిపిస్తోంది. ప్రతి రోజు కొత్త ఫిర్యాదు, కొత్త వివాదం పార్టీ పెద్దలను ఇబ్బందికి గురిచేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**• ప్రొద్దుటూరు రగడ.. లోకేశ్ ముందే నేతల జగడం**

ఇక ప్రొద్దుటూరులో పరిస్థితి కూడా అంతే సంక్లిష్టంగా మారింది. ఇక్కడి ఓ మాల్ విషయంలో రెండు టీడీపీ వర్గాల మధ్య సాగిన రగడ రాళ్ళ దాడుల దాకా వెళ్ళింది. స్థానిక ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, మాజీ ఇంచార్జ్ గండ్లూరు ప్రవీణ్ రెడ్డి వర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఈ వివాదం రేగింది. ఆ విభేదాలు కాస్తా బహిరంగ స్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై మరొకరు వ్యక్తిగత విమర్శలు చేసుకునే పరిస్థితి రావడంతో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అధికార పార్టీగా ప్రజల్లో ఉండాల్సిన సమయంలో సొంత గొడవలతో వార్తల్లో నిలవడం నాయకత్వాన్ని అసహనానికి గురిచేస్తోంది. అంతేకాకుండా నిన్నటి లోకేశ్ పర్యటనలో సైతం వేదిక వద్ద ప్రవీణ్ రెడ్డి అనుచరులు పోలీసులకు పెద్దఎత్తున వివాదం రేగింది. ఈ అంశాన్ని సైతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కళ్లారా చూడటం జరిగింది. దీంతో చినబాబు ఉండగానే ప్రొద్దుటూరు పరిస్థితులు చేయి దాటిపోతుండటం చూసి బాగా హర్ట్ అయినట్టు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికను పంపాలంటూ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి జోనల్ ఇంచార్జ్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి కి ఆదేశించినట్టు తెలుస్తోంది.

**• వర్గపోరుపై కఠిన చర్యలకు సంకేతాలు**

ఈ పరిణామాలన్నింటినీ అత్యంత సీరియస్‌గా తీసుకున్న లోకేశ్ అక్కడి వేదికపై నుంచే ఘాటుగా తనదైన శైలిలో స్పందించినట్టు తెలుస్తోంది. అలాగే 2019 నుంచి 2024 వరకు ప్రొద్దుటూరులో జరిగిన సంఘటనలు సైతం లోకేశ్ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తాను యువగళం పాదయాత్ర కోసం వస్తే వైసీపీ సృష్టించిన ఆగడాలకు అండగా నిలిచిన నేతలు కార్యకర్తలను సైతం కలుపుకొని పోవాలంటూ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డికి సూచించారు. ఇప్పటికే బద్వేలు నియోజకవర్గంలో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయనే అభిప్రాయంతో అక్కడి నాయకత్వంలో మార్పులు చేసింది. అవసరమైతే మరికొన్ని చోట్ల కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చనే సంకేతాలు అప్పుడే వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ కడప పర్యటనకు మరో అర్థం ఏర్పడినట్టుగా కూడా పరిశీలకులు భావిస్తున్నారు.

ఆయన అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాలేదు. జిల్లా నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఉందో నేరుగా విన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేవలం నివేదికల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసే ప్రయత్నం చేశారని సమాచారం.

**• పంచాయితీలు వద్దంటూ నేతలకు యువనేత వార్నింగ్**

ఈ క్రమంలో ప్రొద్దుటూరు కార్యకర్తల సమావేశంలో లోకేశ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. వేదికపైనే ఆయన అసాధారణంగా కఠిన స్వరంతో మాట్లాడారు. ఆయన మాటల్లో ఆక్రోశం కన్పించింది. ఆవేదనతో కూడిన ఘాటైన మాటలు పెల్లుబికాయి "పార్టీ కోసం పనిచేయండి. వ్యక్తుల కోసం కాదు. వర్గాల కోసం కాదు. ఎవరు ఎంత పెద్దవారైనా పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరిస్తే సహించం" అనే సందేశాన్ని స్పష్టంగా ఇచ్చినట్లు సమాచారం. అంతేకాదు... "గొడవలు పెట్టుకోవడం, వర్గాలను పెంచుకోవడం, కార్యకర్తలను విడదీయడం వంటివి మీకు ఇష్టమైతే అలాంటి నాయకులు పార్టీకి అవసరం లేదు. తెలుగుదేశం పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఉండాలనుకునే వారు పార్టీ క్రమశిక్షణతో ఉండాలి. లేకపోతే బయటకు వెళ్లే స్వేచ్ఛ కూడా ఉంది" అంటూ తీవ్రపదజాలంతో హెచ్చరించడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది.

**• రాజంపేట ఇంచార్జ్‌కు లోకేశ్ క్లాస్..**


రెండు రోజుల పర్యటన ముగిసిన తర్వాత కడప విమానాశ్రయంలో జరిగినట్లు ప్రచారంలో ఉన్న మరో సంఘటన జిల్లా రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది. రాజంపేట ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజును ప్రత్యేకంగా పిలిపించి లోకేశ్ మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. "నీకు ఇంచార్జ్ పదవి ఎందుకు ఇచ్చాం? పార్టీని బలోపేతం చేయడానికా? లేక ప్రత్యేకంగా నీ వర్గాన్ని నిర్మించుకోవడానికా? రాజంపేటలో ఉండాల్సింది టీడీపీ ఒక్కటే. వర్గాలు కాదు. అందరినీ కలుపుకుని నడవాలి. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి చూపించు. తర్వాత మిగతా విషయాలు మాట్లాడుకుందాం" అని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఆ సమయంలో చమర్తి రాజు సామాజిక సమీకరణల గురించి ఏదో ప్రస్తావించబోతే... "అది వద్దు. ముందుగా నువ్వు సరిగా ఉండు. పార్టీని ఒకే వేదికపైకి తీసుకురా" అంటూ మాట మధ్యలోనే ఆపినట్లు కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ రకమైన ప్రచారం ఒక్క రాజంపేటలోనే కాదు.. టోటల్ జిల్లా వ్యాప్తంగా టీడీపీ వర్గాల్లో విస్తృతంగా వినిపిస్తోంది.

**• అంతర్గత విభేదాలే టీడీపీ సవాల్‌గా మారుతున్నాయా?**

కడప రాజకీయాలను పరిశీలించే వారు ఒక విషయాన్ని గుర్తు చేస్తున్నారు. వైఎస్ కుటుంబానికి సంప్రదాయ బలమైన జిల్లాలో తెలుగుదేశం పార్టీకి ఎదగాలంటే ప్రత్యర్థులతో పోరాటం ఒక వైపు ఉంటే... సొంత ఇంటి గొడవలను అదుపులో పెట్టడం మరో పెద్ద సవాల్. కార్యకర్తల్లో ఉత్సాహం ఉన్నా, ఎక్కడికక్కడ నాయకత్వంలో ఐక్యత లేకపోతే ఆ శక్తి వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే మరో కోణాన్ని కూడా విస్మరించలేమంటున్నారు రాజకీయ పరిశీలకులు. అదేంటంటే.. అధికార పార్టీల్లో స్థానిక నాయకుల మధ్య పోటీ, ఆధిపత్య వివాదాలు కొత్త విషయం కాదు. వాటిని సమయానికి పరిష్కరిస్తే పార్టీ మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. కానీ అవి నియంత్రణ పరిధి దాటితే ఎన్నికల సమయంలో ప్రత్యర్థులకు అవకాశంగా మారే ప్రమాదం ఉంటుంది.

**• కడప వర్గపోరుకు ముగింపు దొరుకుతుందా?**

లోకేశ్ తాజా హెచ్చరికతో కడప టీడీపీలో క్రమశిక్షణ పెరుగుతుందా? లేక అసంతృప్తి మరింత పెరిగి కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో వినిపిస్తోంది. ఒకవైపు అధిష్ఠానం కఠిన సంకేతాలు ఇస్తుండగా, మరోవైపు స్థానిక నాయకులు తమ వైఖరిని మార్చుకుంటారా లేదా అన్నదే ఆసక్తికర అంశంగా మారింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ నియామకాలు... ఇవన్నీ ఈ అంతర్గత సమీకరణాలపైనే ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే కడపలో జరిగిన ఈ రెండు రోజుల పర్యటనను సాధారణ జిల్లా పర్యటనగా కాకుండా "పార్టీ క్రమశిక్షణకు లోకేశ్ ఇచ్చిన వార్నింగ్ సిగ్నల్"గా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి ఒకే ఒక్క ప్రశ్నపైనే ఉంది. లోకేశ్ క్లాస్‌తో కడపలోని వర్గ రాజకీయాలకు బ్రేక్ పడుతుందా? లేక పైకి నిశ్శబ్దం కనిపించినా లోపల అసంతృప్తి మరింత పెరిగి మరోసారి భగ్గుమంటుందా? జవాబు మాత్రం కాలమే చెప్పాలి. అప్పటివరకు... వెయిట్ అండ్ సీ.





**కడప జిల్లాలో గత కొంతకాలంగా పెరుగుతున్న వర్గపోరు, నాయకుల మధ్య ఆధిపత్య వివాదాలు, కార్యకర్తల్లో అసంతృప్తిని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు మంత్రి నారా లోకేశ్ తాజా పర్యటన స్పష్టం చేసింది. పైకి అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సమావేశాలు జరిగినా... లోపల మాత్రం జిల్లా రాజకీయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి నేతలకు కఠిన హెచ్చరికలు జారీ చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ కంటే వ్యక్తులు, వర్గాలు పెద్దవి కాదని, కార్యకర్తలను విడదీసే రాజకీయాలకు ఇకపై అవకాశం ఉండదనే సంకేతాన్ని లోకేశ్ స్పష్టంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉన్న నాయకులు అంతర్గత విభేదాలతో సంస్థకు నష్టం కలిగిస్తే సహించబోమనే సందేశం వెళ్లిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అవసరమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమన్న హెచ్చరిక కూడా ఈ పర్యటనలో స్పష్టంగా కనిపించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రానున్న స్థానిక ఎన్నికలు, సంస్థాగత నియామకాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు వర్గ రాజకీయాలకు దూరంగా ఉండి పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నదే లోకేశ్ షాక్ ట్రీట్మెంట్ సారాంశంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.**















# వామ్మో కరోనా

- ఏపీలో కరోనా కలకలం
- పెరుగుతున్న కేసులు
- నలుగురు మృత్యువాత
- అప్రమత్తంగా ఉండాల్సిందే!



భయపడొద్దు.. జాగ్రత్తలు పాటించండి

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి కోవిడ్19 కేసులు నమోదవుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. జూన్ 26 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 12 కరోనా కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కడప, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో ఎక్కువగా కేసులు గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో కోవిడ్ బారినపడి నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముగ్గురు హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దేశంలోని పలు నగరాల్లో కూడా కోవిడ్ కేసులు వెలుగుచూస్తుండటంతో ప్రజలు మళ్లీ కరోనా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

# గ్రామీణ వైద్యానికి పెద్దపీట

- కాలేరులో ఆరోగ్య సదుపాయాల విస్తరణ
- రూ.36 లక్షలతో హెల్త్ క్లినిక్ నిర్మాణం
- హెల్త్ క్లినిక్‌కు ఎమ్మెల్యే వేగుళ్ల శంకుస్థాపన



గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఆయన శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించే ఈ హెల్త్ క్లినిక్ వల్ల ప్రాథమిక వైద్యం కోసం గ్రామస్థులు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, వివిధ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పరామర్శ పేరిట బలప్రదర్శనా: హోం మంత్రి అనిత

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ప్రతిసారి బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. విశాఖ మత్స్యకారుల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ ప్రయత్నించి విఫలమైందని ఆరోపించారు. వైసీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. పలాస ఘటనలో తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు.

## వైసీపీ తీరుపై బుచ్చయ్య విమర్శలు

ముద్రగడను చివరిసారి చూసేందుకు వచ్చిన ఆయన కుమార్తెను వైసీపీ నేతలు అడ్డుకోవడం ఏమిటని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. పరామర్శకు వెళ్లిన వైసీపీ అధ్యక్షుడు జగన్ ర్యాలీలా వెళ్లడం రాజకీయ ప్రయోజనం కోసమేనని విమర్శించారు. మత్స్యకారులు, ఆక్వా రైతుల కోసం వైసీపీ పాలనలో ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ఘటనపై కూడా జగన్ వైఖరిని ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడిన బుచ్చయ్యచౌదరి, ముద్రగడ అంత్యక్రియలకు ప్రభుత్వ లాంఛనాలు నిర్వహిస్తుంటే మాజీ మంత్రి అంబటి రాంబాబుతో పాటు వైసీపీ నేతలు అడ్డుకోవడం బాధాకరమన్నారు.

## టీఎంసీకి మరో రాజ్యసభ ఎంపీ రాజీనామా

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రుక్మిణి మల్లిక్ గురువారం పార్టీ సభ్యత్వానికి, రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్‌కు సమర్పించారు. దీంతో టీఎంసీ నుంచి రాజ్యసభకు రాజీనామా చేసిన నాలుగో సభ్యురాలిగా నిలిచారు.

## ఆక్వా సబ్సిడీపై జగన్‌కు గొట్టిపాటి కౌంటర్

ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీని దెబ్బతీసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. జగన్ ప్రభుత్వమే ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను సబ్సిడీకి దూరం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని రద్దు చేసి అర్హులైన రైతులందరికీ మళ్లీ విద్యుత్ సబ్సిడీ పునరుద్ధరించిందని తెలిపారు.

## డీలిమిటేషన్ ఏ రాష్ట్రానికీ నష్టం లేదన్న లక్ష్మణ్

డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు తగ్గకుండా 50 శాతం వరకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళల సాధికారతకు కీలక అడుగని పేర్కొన్నారు. డీలిమిటేషన్, మహిళా బిల్లులను ప్రతిపక్షాలు వ్యతిరేకించడం సరైంది కాదని విమర్శించారు.

## కామారెడ్డిలో యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామంలో రంగబోయిన సందీప్ (23) అనే యువకుడు గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన ఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సందీప్ గతంలో పోక్సో కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. తన కుమారుడిని బాధిత కుటుంబ సభ్యులు బెదిరించారని, అదే కారణంగా ఈ ఘటన జరిగి ఉండొచ్చని సందీప్ తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

## మామునూరు ఎయిర్‌పోర్టుపై బీఆర్ఎస్ క్లారిటీ

మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించిన అనుమతులు, భూసేకరణ ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో చర్చలు జరిపారని పేర్కొన్నారు. ఉడాన్ పథకం కింద రన్‌వే విస్తరణ, భూసేకరణ చర్యలు కూడా అప్పుడే చేపట్టినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదని విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి పునాది వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ శోభ

ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ నెలకొంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ కుటుంబ సమేతంగా శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకుని సంప్రదాయబద్ధంగా ఆషాఢ సారె సమర్పించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆషాఢ ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది.

## వర్షా ల కోసం కప్ప పూజలు

వర్షాలు ఆలస్యమవడంతో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా కప్ప పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో మహిళలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఆలయం వద్ద జలాభిషేకం నిర్వహిస్తూ రైతాంగం కష్టాలు తీరాలని ఆకాంక్షించారు. వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని సర్పంచ్ తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యవసాయం దెబ్బతినడంతో పాటు ప్రజల జీవన విధానంపై ప్రభావం పడుతుందని అన్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీట్ రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

- 11.21 లక్షల మంది అర్హత
- ఫలితాలు ప్రకటించిన ఎన్‌టీఏ



నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ ఎన్‌టీఏ విడుదల చేసింది. వైద్య, దంత, ఆయుష్ సహా అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు మొత్తం 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. జూన్ 21న నిర్వహించిన రీఎగ్జామ్‌కు దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది హాజరయ్యారు. భారత్‌లో 551 నగరాలు, విదేశాల్లో 14 నగరాల్లో 5,440 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేలా ఫలితాలను ప్రకటించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

### టాపర్లుగా ఇద్దరు విద్యార్థులు

ఈ ఏడాది గరిష్ఠంగా 720 మార్కులకు గాను 715 మార్కులు సాధించి పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన పన్షుల్ బన్సాల్ సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మొత్తం 138 మంది విద్యార్థులు 690 మార్కులకు పైగా సాధించారు. వారిలో 93 శాతానికి పైగా తొలిసారి నీట్ రాసిన అభ్యర్థులే కావడం విశేషం. టాప్ స్కోరర్లలో 99 శాతం మంది 17 నుంచి 19 సంవత్సరాల వయసు గల విద్యార్థులే ఉన్నారు.

### అమ్మాయిలదే పైచేయి

ఈసారి అర్హత సాధించిన వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. మొత్తం అర్హత పొందిన అభ్యర్థుల్లో 58 శాతానికి పైగా మహిళలే ఉన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. మహిళల అర్హత శాతం 56.8గా నమోదు కాగా, పురుషుల అర్హత శాతం 55.1గా ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థులు అర్హత సాధించారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.7 లక్షల మందికి పైగా అర్హత పొందగా, లక్షద్వీప్‌లో 43 మంది మాత్రమే అర్హత సాధించారు.

### కౌన్సెలింగ్‌కు సిద్ధం

ఈసారి 19 మంది అభ్యర్థులు 700 మార్కులకు పైగా, 1,492 మంది 650 మార్కులకు పైగా, 10,160 మంది 600 మార్కులకు పైగా మార్కులు సాధించారు. ఆల్ ఇండియా కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. రాష్ట్ర కోటా సీట్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ చేపట్టనున్నాయి. కేటగిరీల వారీగా కట్ఆఫ్‌లు, టాపర్ల వివరాలు, ఇతర గణాంకాలను కూడా ఎన్‌టీఏ అధికారికంగా విడుదల చేసింది. దీంతో దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

# పోలవరం పనులపై బీజేపీ ఫోకస్

- పోలవరం వద్ద నేతల పర్యటన
- ర్యాలీగా చేరుకున్న బీజేపీ నేతలు




గోదావరి జిల్లాల జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ బీజేపీ అగ్రనేతలు సందర్శించారు. పార్టీ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి భారీ ర్యాలీగా పోలవరం చేరుకున్నారు. అంతకుముందు రాజమహేంద్రవరంలోని అటల్ బిహారీ వాజపేయి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి వై సత్యకుమార్ యాదవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి బీజేపీ యువమోర్చా నాయకులు భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు.


### ప్రాజెక్టు పురోగతిపై అధికారుల వివరణ

పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులతో బీజేపీ నేతలు సమీక్ష నిర్వహించారు. కుడి, ఎడమ కాలువల నిర్మాణం, పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పురోగతిని మ్యాప్‌ల ఆధారంగా అధికారులు వివరించారు. ఇప్పటివరకు పూర్తైన పనులు, మిగిలిన నిర్మాణాలపై పీవీఎన్ మాధవ్ అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇరిగేషన్ టన్నెల్ పనులు మరో నెల రోజుల్లో పూర్తవుతాయని, రెగ్యులేటర్ పనులు కొంత పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# దోచుకునోడికి.. దోచుకున్నంత

- దొంగ లెక్కల దోపిడీ.. అన్నదాత పేరుతో లూటీ
- నిజామాబాద్‌లో రైస్ మిల్లుల దందా బట్టబయలు





నిజామాబాద్ జిల్లాలో వడ్ల కొనుగోళ్ల పేరుతో భారీ అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా మాక్లూర్, నందిపేట్ మండలాల్లో కొన్ని సహకార సంఘాల పరిధిలో ఈ వ్యవహారం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. పంటలు పండని భూముల యజమానుల పట్టా పాస్ పుస్తకాలను సేకరించి, ఆయా రైతుల వద్ద నుంచే వడ్లు కొనుగోలు చేసినట్లు రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఒక్క గింజ ధాన్యం కూడా కొనకుండా కాగితాలపై మాత్రమే కొనుగోళ్లు జరిగినట్లు నమోదు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా ప్రభుత్వానికి సమర్పించే వివరాలను తారుమారు చేసి కోట్ల రూపాయల నిధులను దారి మళ్లిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### దొంగ ట్రక్ షీట్లతో కోట్ల లావాదేవీలు

నకిలీ కొనుగోలు రికార్డులు సిద్ధమైన తర్వాత రైస్ మిల్లుల యాజమాన్యాలు రంగంలోకి దిగుతున్నాయని సమాచారం. వడ్లు మిల్లులకు తరలించినట్లు నకిలీ ట్రక్ షీట్లు సృష్టించి, అసలు రవాణా జరగకపోయినా భారీ వ్యాపారం జరిగినట్లు చూపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కొందరు సహకార సంఘాల అధికారులు, మిల్లర్లు కలిసి పనిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా వచ్చిన సొమ్మును కమిషన్ల రూపంలో పంచుకుంటూ ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఎఫ్‌సీఐ లెక్కల్లో బయటపడుతున్న కొరత

ఈ నకిలీ లావాదేవీల ప్రభావం ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన బియ్యం నిల్వలపై పడుతోందని తెలుస్తోంది. రికార్డుల్లో చూపినంత ధాన్యం మిల్లుల్లో లేకపోవడంతో బియ్యం సరఫరాలో కొరత ఏర్పడుతోందని సమాచారం. ప్రభుత్వం కేటాయించిన కోటాను పూర్తి చేసినట్లు చూపించాల్సిన పరిస్థితి రావడంతో కొందరు మిల్లర్లు మరో అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీల సమయంలో లోటు బయటపడకుండా ఉండేందుకు రికార్డులను సరిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### రేషన్ బియ్యంతో కొరత పూడ్చే ఎత్తుగడ

ఎఫ్‌సీఐ నిల్వల్లో కనిపిస్తున్న కొరతను కప్పిపుచ్చేందుకు పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్నే కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరకు సేకరించిన రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రభుత్వ వడ్లను మరపట్టించి వచ్చిన బియ్యంగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో పేదల కోసం ఉద్దేశించిన ధాన్యం అక్రమ మార్గంలో తిరిగి ప్రభుత్వ గోదాములకే చేరుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### అధికారుల మౌనంపై తీవ్ర విమర్శలు

జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వచ్చినా సంబంధిత అధికారులు సమర్థంగా స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైస్ మిల్లుల్లో తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా చర్యలు కనిపించకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతుల పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకునే అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

**— నవీన్ అవధూత, సీనియర్ జర్నలిస్ట్**

## ఏసీబీ వలకు ఇద్దరు అధికారులు

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆదిలాబాద్ నీటిపారుదల శాఖలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విట్టల్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రకాశ్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.60 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ ట్రాప్ బృందం అదుపులోకి తీసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నివాసంలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి

పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేసిన జేఏసీ, మహిళా రిజర్వేషన్లను జనగణన, డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని వ్యతిరేకించింది. ఆ నిబంధనలను తొలగించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. మహిళలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి అవసరమని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# కౌంట్ డౌన్ షురూ


- మోడీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూపు
- నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం!



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించాలని ఇప్పటికే ఆహ్వానం పంపినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి తేదీ ఖరారైన వెంటనే ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయానికి కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025 పరిధిలోకి తీసుకువస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంతో భోగాపురం విమానాశ్రయం కేటగిరీ 1 జాబితాలో 39వ స్థానంలో చేరింది. అదే సమయంలో ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా కూడా సేవలు అందించే అర్హత పొందింది.

### అంతర్జాతీయ ప్రయాణాలకు ఊతం

ఈ గుర్తింపుతో విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు భోగాపురం విమానాశ్రయం ద్వారా నేరుగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. ఇమ్మిగ్రేషన్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక కేంద్రంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైతే ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. పర్యాటకం, పారిశ్రామిక రంగం, ఎగుమతులు వేగం పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రానికి అంతర్జాతీయ అనుసంధానం మరింత బలపడటంతో విశాఖపట్నం ప్రాంత అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలవనుంది.



# బంగాళాఖాతంలో అల్పపీడనం

- నేడు ఏపీకి వర్షా ల హెచ్చరిక
- అల్పపీడన ప్రభావంతో వానలు

వాయువ్య బంగాళాఖాతంలో స్పష్టమైన అల్పపీడనం ఏర్పడటంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం మారనుంది. కోస్తాంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతంగా ఉండటంతో పాటు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశముందని వెల్లడించారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాల సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగుల సమీపంలో నిలబడవద్దని అధికారులు హెచ్చరించారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మాత్రమే బయటకు రావాలని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



# ముద్రగడ కుటుంబానికి యనమల పరామర్శ

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. కిర్లంపూడిలో ముద్రగడ తనయులు ముద్రగడ బాలు, ముద్రగడ గిరిని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ముద్రగడ పద్మనాభంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని యనమల రామకృష్ణుడు గుర్తు చేసుకున్నారు. ఆయన నీతి, నిజాయితీకి కట్టుబడి ప్రజాసేవ చేసిన నాయకుడని కొనియాడారు. రాజకీయాల్లో ముద్రగడ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



# చేనేత ఏడీ శ్రీనివాస్‌కు అభినందనలు

- నేతన్నలకు అండగా ఉంటారన్న ధీమా

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చేనేత సహకార సంఘాల నూతన అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పి. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. నేతన్నల సమస్యలు బాగా తెలిసిన వ్యక్తి జిల్లాకు రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. గతంలో చేనేత కార్మికులకు శ్రీనివాస్ అందించిన సేవలు ప్రశంసనీయమని బండార్లంక టీడీపీ గ్రామ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, ఆశపు రామలింగేశ్వరరావు, కొండా శ్రీను, చింతపట్ల భద్రరావు, వాసా భీమశంకరం హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# క్రికెట్‌లో రాణిస్తున్న కడప కుర్రోడు



### రంజీ అవకాశాల కోసం ఎదురుచూపు!

కష్టానికి ప్రత్యామ్నాయం లేదు... ప్రతిభకు అడ్డుకట్ట ఉండదు. ఇదే విషయాన్ని తన బౌలింగ్‌తో నిరూపిస్తున్నాడు కడప జిల్లా యువ క్రికెటర్ షరీఫ్ పఠాన్. రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్, ఆల్‌రౌండర్‌గా వరుసగా అద్భుత ప్రదర్శనలు చేస్తూ ఆంధ్ర క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 2025 రంజీ ప్రొబబుల్స్ మ్యాచ్‌లో ఏకంగా 6 వికెట్లు పడగొట్టి తన సామర్థ్యాన్ని చాటుకున్న షరీఫ్, అదే ఏడాది జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే టోర్నమెంట్‌లో 4 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు. అందులో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించడం అతని నిలకడకు నిదర్శనం. T20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో కూడా ఒకే మ్యాచ్‌లో 6 వికెట్లు సాధించి ప్రత్యర్థి బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. 2026లో వన్డే ఇంటర్ జోనల్ జట్టుకు ఎంపిక కావడం, ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ తరపున ఆడి కేవలం 2 ఓవర్లలో 2 వికెట్లు సాధించడం అతని ప్రతిభకు మరో నిదర్శనం. ఇంతటి గణాంకాలు నమోదు చేసినా, షరీఫ్ పఠాన్‌కు ఇంకా పూర్తి స్థాయి రంజీ అవకాశం రాకపోవడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రతిభకు సరైన గుర్తింపు లభిస్తే, కడప నేల నుంచి మరో నాణ్యమైన స్పిన్నర్ ఆంధ్ర జట్టుకు దొరికే అవకాశం ఉంది. ఇప్పుడు అందరి చూపు ఒక్కటే... రంజీ జట్టులో షరీఫ్ పఠాన్‌కు ఎప్పుడు అవకాశం దక్కుతుంది?

# కార్డిఫ్‌లో భారత్‌కు షాక్..

### సిరీస్ సమం చేసిన ఇంగ్లండ్



కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 11తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.4 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయింది. శ్రేయస్ అయ్యర్ 66 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, విరాట్ కోహ్లీ 65 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో జస్ప్రీత్ బుమ్రా 20 పరుగులు చేసి జట్టుకు కొంత అదనపు స్కోరు అందించాడు. అయితే 30వ ఓవర్ తర్వాత భారత్ వరుసగా వికెట్లు కోల్పోవడంతో భారీ స్కోరు చేసే అవకాశం చేజారిపోయింది. మధ్య ఓవర్లలో కేవలం 32 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోవడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది.

### ఇంగ్లండ్ బౌలర్ల కట్టుదిట్టం

భారత్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్ అద్భుతంగా రాణించారు. ఇద్దరూ తలో మూడు వికెట్లు తీసి భారత బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. కొత్త బంతితో కట్టుదిట్టమైన బౌలింగ్ చేసిన ఇంగ్లండ్ బౌలర్లు మధ్య ఓవర్లలోనూ ఒత్తిడి కొనసాగించారు. భారత బ్యాటర్లు మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మార్చలేకపోయారు. చివరి పది ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాల్సిన సమయంలో వరుస వికెట్లు కోల్పోవడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది.

### సిరీస్‌కు తుది పోరు

ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ 11తో సమంగా మారింది. తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక మూల్యం చెల్లించుకుంది. బ్యాటింగ్‌లో మధ్య ఓవర్ల వైఫల్యం, చివరి దశలో వికెట్ల పతనం జట్టుపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు ఇంగ్లండ్ ఒత్తిడిలోనూ ధైర్యంగా ఆడి కీలక విజయాన్ని అందుకుంది. ఇప్పుడు సిరీస్ విజేతను నిర్ణయించే మూడో వన్డేపై ఇరు జట్లు దృష్టి సారించాయి. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టే సిరీస్‌ను సొంతం చేసుకోనుంది.

# వన్డేలకు రోహిత్‌కు గుడ్‌బై?

### ఇంగ్లండ్ సిరీస్‌తో ముగింపు

భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే కెరీర్ ముగింపుకు చేరువలో ఉందనే వార్తలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ అనంతరం రోహిత్‌కు జట్టులో అవకాశం ఉండకపోవచ్చని పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. రెండో వన్డేలో రోహిత్ 47 బంతుల్లో 26 పరుగులు మాత్రమే చేయడంతో అతని భవిష్యత్తుపై సందేహాలు మరింత పెరిగాయి. గత ఎనిమిది వన్డేల్లో రోహిత్ 241 పరుగులు మాత్రమే చేయగా, ఒకే ఒక్క అర్ధశతకం నమోదు చేశాడు. జూలై 19న జరిగే మూడో వన్డే అతని చివరి మ్యాచ్ కావచ్చని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### జైస్వాల్‌కు అవకాశమే లక్ష్యం

2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని బీసీసీఐ సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా యశస్వి జైస్వాల్‌కు వరుస అవకాశాలు కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రోహిత్ భవిష్యత్తుపై తుది నిర్ణయం ఆయనే తీసుకోవాలని సెలెక్టర్లు సూచించినట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ విషయంపై బీసీసీఐ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో రోహిత్ నిజంగానే వన్డేలకు వీడ్కోలు పలుకుతారా లేదా అన్న అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# స్మృతి మంధానను కెప్టెన్ చేయండి

### మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కీలక సూచన

భారత మహిళల క్రికెట్ జట్టులో భవిష్యత్ నాయకత్వంపై మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కీలక సూచనలు చేశారు. వన్డే, టెస్టు జట్లకు స్మృతి మంధానను కెప్టెన్‌గా నియమించాలని ఆమె అభిప్రాయపడ్డారు. హర్మన్‌ప్రీత్ కౌర్ పదవీకాలం ముగిసిన తర్వాత అనుభవజ్ఞురాలైన మంధాన బాధ్యతలు చేపట్టేందుకు పూర్తి అర్హురాలని చెప్పారు. మరోవైపు టీ20 జట్టుకు యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ ఫార్మాట్‌లో షెఫాలీ వర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే జట్టుకు దీర్ఘకాల ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నిరాశాజనక ప్రదర్శనల తర్వాత నాయకత్వంపై సమీక్ష అవసరమని మిథాలీ అభిప్రాయపడ్డారు. కెప్టెన్ ఎంపికలో ఫిట్‌నెస్, నిలకడైన ప్రదర్శన, భవిష్యత్ ప్రణాళికలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. యువ నాయకులను ముందుగానే తీర్చిదిద్దడంలో బీసీసీఐ మరింత దృష్టి పెట్టాలని కోరారు. షెఫాలీ వర్మతో పాటు జెమీమా రోడ్రిగ్స్ కూడా కెప్టెన్సీకి అర్హురాలేనని చెప్పారు. ఒకసారి నాయకత్వం అప్పగిస్తే వారికి తగిన సమయం ఇవ్వాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మిథాలీ రాజ్ స్పష్టం చేశారు.



# ప్రభాస్ ఫౌజీ
# డిసెంబర్ 3న లాక్

### రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల

ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## నా ఫోటోలు తీయకండి ప్లీజ్
# మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.






## మూడేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా

### నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే: అఖిల్

మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.




## మహాప్రభు జగన్నాథ్ విడుదలపై స్టే

### నేడు విచారించనున్న సుప్రీం కోర్టు

ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085